బారులు తీరాయి..



బాలరాజుపల్లె చెయ్యేరు ఇసుక రీచ్ వద్ద బారులు తీరిన వందలాది వాహనాలు

- బాలరాజుపల్లె ఇసుక రీచ్‌లో టిప్పర్ల క్యూ

రాజంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని బాలరాజుపల్లె చెయ్యేరునది ఇసుక రీచ్‌లో సోమవారం ఇసుక కోసం టిప్పర్లు వందలాదిగా బారులు తీరాయి. ప్రభుత్వం చెయ్యేరు నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ ఇసుక రీచ్ నుంచి అన్నమయ్య జిల్లా వాసులందరికీ ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ ఇసుక రీచ్ వద్ద బారులు తీరుతున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్‌లేని వాహనాలు కూడా ఇక్కడ క్యూలైన్‌లో ఉన్నాయి. రాజంపేట, రాయచోటి ఘాట్ రోడ్డులో ఈ ఇసుక రవాణా సాగుతోంది. ఎప్పుడు దట్టమైన అడవిలో అనేక మలుపులు, రోడ్డు సక్రమంగా లేకపోవడం, వాహనాల రద్దీతో ఈ ప్రాంతం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనికితోడు వందలాది ఇసుక వాహనాలతో ఈ దారి గుండా ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆశలు.. అడియాసలాయె..

ఎలాగైనా మద్యం షాపులు దక్కించుకోవాలని గంపగుత్తగా ఎక్కువ దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. మద్యం షాపుల కేటాయింపులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో అదృష్టవంతులు షాపులు దక్కించుకున్నారు. ఇందులో 16 షాపులను మహిళలు దక్కించుకోగా నంద్యాలకు చెందిన మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కూతురు సుజల ఒకరే 6 దుకాణాలు పొందారు. మరో పది మంది రెండేసి దుకాణాలను దక్కించుకున్నారు. ఇలా మద్యం షాపులు దక్కించుకున్న వాళ్లలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లూ ఉన్నారు.

- గంపగుత్తగా వేసినోళ్లకు దక్కని షాపులు
- కొందరికి మోదం.. చాలా మందికి ఖేదం
- మహిళలకు 16 షాపులు
- నంద్యాల ఎస్పీవై రెడ్డి కూతురుకు ఆరు దుకాణాలు
- ప్రశాంతంగా మద్యం షాపుల లాటరీ



మద్యం షాపులకు లాటరీ తీస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 8 ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల పరిధిలో 111 మద్యం దుకాణాల కోసం ఈనెల 1వ తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. తొలుత ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉండగా.. తక్కువగా దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం ఈ గడువును 14 వరకు పెంచింది. చివరికి సరాసరి ఒక్కో దుకాణానికి 20 దరఖాస్తుల చొప్పున 2160 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల నుంచి సోమవారం రాయచోటిలోని అజయ్ ఫంక్షన్ హాల్‌లో లాటరీ తీశారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ సమక్షంలో లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల కేటాయింపు జరిగింది.

అదృష్టవంతురాలు సుజల..

ఒక మద్యం దుకాణం దక్కించుకున్న వాళ్లను అదృష్టవంతులు అని అందరూ అంటుంటారు. ఇక రెండు షాపులు దక్కించుకుంటే.. నక్కతోక తొక్కి వచ్చాడు అంటారు. అదే ఆరు షాపులు దక్కించుకుంటే.. సన్నపురెడ్డి సుజల అని అనవచ్చు. నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కూతురే సన్నపురెడ్డి సుజల. ఈమెను అదృష్ట దేవత బాగా కరుణించినట్లుగా ఉంది. జిల్లాలోని 111 షాపులలో ఈమె ఆరింటిని దక్కించుకున్నారు. చిన్నమండెం, కలికిరి, పీలేరు మండలాల్లో రెండేసి షాపులు ఈమె దక్కించుకున్నారు. మొత్తం 111 షాపులలో 16 షాపులను మహిళలు దక్కించుకోవడం విశేషం. సుండుపల్లె మండలంలో మూడు షాపులు ఉండగా.. అందులో సావిత్రి, దేవి అనే ఇద్దరు మహిళలు దక్కించుకున్నారు. నందలూరులో విజయలక్ష్మి, ఓబులవారిపల్లెలో కె.మల్లీశ్వరిలు దక్కించుకున్నారు. మదనపల్లె రూరల్ మండలంలో రెండు షాపులను పి.ఇందిర దక్కించుకున్నారు. బి.కొత్తకోటలో రేవతి, కురబలకోటలో పి.మల్లీశ్వరి దక్కించుకున్నారు. వాల్మీకిపురంలో రెండు షాపులను దీప దక్కించుకున్నారు.

పది మందికి రెండేసి షాపులు

షాపుల కేటాయింపులో అదృష్టం కొందరిని వరించింది. కనీసం ఒక షాపు కూడా రాక చాలా మంది బాధపడుతూ ఉంటే.. ఓ పది మందికి రెండేసి షాపులు దక్కాయి. గడికోట కిరణ్‌కుమార్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లో రెండు షాపులు దక్కించుకున్నారు. రాయచోటి, రాజంపేటలో సి.విప్రసాద్ రెండు షాపులు దక్కించుకున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో పి.ఇందిర రెండు షాపులు దక్కించుకున్నారు. మదనపల్లె రూరల్ మండలంలో కె.దామోదర్, వాల్మీకిపురంలో ఎం.దీప రెండు షాపులను దక్కించుకున్నారు.

రంగంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

మద్యం దుకాణాల కోసం రాజకీయ నాయకులు, వ్యాపారులే కాకుండా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు రంగంలోకి దిగారు. మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 22 మద్యం దుకాణాల్లో నాలుగు దుకాణాలను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నవారు దక్కించుకున్నారు. మదనపల్లె పట్టణంలో ఒకటి, మదనపల్లె రూరల్‌లో రెండు, రామసముద్రంలో ఒకటి మద్యం దుకాణాలకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు దరఖాస్తు చేసుకోగా వారినే అదృష్టం వరించింది.

సిండికేట్ నో యూజ్

ఈసారి ప్రభుత్వం దరఖాస్తు ఫీజు రెండు లక్షల రూపాయలు పెట్టి.. ఒకరు ఎన్ని దరఖాస్తులు అయినా వేసుకోవచ్చునే వెసులుబాటు ఇచ్చింది. దీంతో ఎలాగైనా మద్యం దుకాణాలు దక్కించుకోవాలని అనుకున్న పలువురు పెద్దఎత్తున దరఖాస్తులు వేశారు. ఒకటికి మించి షాపులకు వేశారు. ఇంకా కొందరు పదుల సంఖ్యలో దుకాణాలకు దరఖాస్తులు వేశారు. ఇంకా కొందరు ఒక గ్రూపుగా ఏర్పడి.. నాకు షాపు వస్తే.. మీకూ వాటా.. మీకు వస్తే. .నాకూ వాటా.. అనే పద్ధతిలో చాలా దుకాణాలకు దరఖాస్తులు వేశారు. రాయచోటి పట్టణంలో పది ఇరవై మంది గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు చేశారు. మదనపల్లెలోనూ.. పలువురు సిండికేట్లుగా మారి 10 చొప్పున దరఖాస్తులు చేసుకున్నా అలాంటి వారికి ఒక్క దుకాణం కూడా దక్కలేదు. పలువురు పాత వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి సుమారు 30 నుంచి 80 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. అలాంటి వారిలో ఒక గ్రూపునకు ఒకటి, ఇంకో గ్రూపునకు ఒకటి చొప్పున మాత్రమే దుకాణాలు దక్కాయి.

కొత్త వ్యాపారులకు ఇబ్బందులు

లక్కీడిప్‌లో మద్యం షాపు దక్కించుకున్న వాళ్లకు ఇప్పుడు గదుల రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుచోట్ల కొందరు దరఖాస్తులు వేయడానికి ముందే.. ముఖ్యమైన సర్కిళ్లలో గదులు తమ పేరుతో తీసేసుకున్నారు. అయితే ఇప్పుడు వాళ్లకు షాపులు రాలేదు. అయినా ఆశ చంపుకోకుండా.. తమ ఆధీనంలో ఉన్న గదుల ద్వారా మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. తమకు షాపులో వాటా ఇస్తే గది ఇస్తామని బేరాలు మొదలు పెట్టారు. మదనపల్లె పట్టణంలో 10 మద్యం దుకాణాలలో ఐదు మంది గతంలో మద్యం వ్యాపారాలు చేసిన వాళ్లే. మిగిలిన ఐదు మందీ కొత్త వాళ్లే. ఇటువంటి వాళ్లకు పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో అద్దె గదుల కొరత ఏర్పడింది. గతంలో ఈ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఉన్న గదులకు ఇప్పుడు డిమాండ్ పెరిగింది. ఈ గదులను అద్దెకు ఇవ్వాలని లాటరీ తగిలిన వారు బేరసారాలు చేస్తున్నారు. దీంతో గదుల యజమానులు అద్దె బదులు తమకు వ్యాపారంలో భాగస్వామ్యం కావాలని షరతులు పెడుతున్నారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కొత్త వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ఇదే పరిస్థితి రాయచోటి, రాజంపేట పట్టణాల్లోనూ ఉంది. కొన్నిచోట్ల మండల కేంద్రాల్లోనూ.. ఇదే విధంగా గదుల రాయబేరం నడుస్తోంది.

పకడ్బందీ చర్యలు

దరఖాస్తుల సమయంలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయనే ఆరోపణల నేపథ్యంలో.. లాటరీ విధానంలో దుకాణాల కేటాయింపులో ఎటువంటి ఆరోపణలు, వివాదాలు లేకుండా ఉండేందుకు కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. సాక్షాత్తూ.. కలెక్టరే స్వయంగా లాటరీలో చీటీలు తీసి.. మద్యం షాపు దక్కించుకున్న వాళ్ల పేర్లు ప్రకటించారు. దీంతో ఎక్కడా తమకు అన్యాయం జరిగిందనో? ఓ వర్గానికో.? పార్టీకో మేలు జరిగిందనో? ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. దరఖాస్తు చేసుకున్న వాళ్లు జిల్లా నలుమూలల నుంచి వచ్చారు. దరఖాస్తు చేసుకున్న మహిళలు చిన్నపిల్లలతో లాటరీ నిర్వహించిన అజయ్ ఫంక్షన్ హాల్‌కు వచ్చారు. ఇందులో పలు షాపులకు కడప జిల్లా వైసీపీ నాయకులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. కాగా మద్యం షాపులు దక్కించుకున్న వారు వెంటనే అక్కడే షాపులకు సంబంధించి డబ్బులు చెల్లించారు. దీంతో మొత్తం రూ.11.14 కోట్ల రూపాయలను చెల్లించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, ఎక్సైజ్ సీఐ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.





మద్యం షాపుల లాటరీకి హాజరైన దరఖాస్తుదారులు.. షాపులు దక్కించుకున్నవారు నగదు చెల్లిస్తున్న దృశ్యం



ఆరోగ్యఖరము..

- కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు..
- 10 మిల్లీలీటర్లు రూ.100
- గాడిద పాలకు భలే గిరాకీ..

వివరాలు 6లో..

అద్భుత ఇంజనీర్లు

- రాజంపేటలో హల్‌చల్ చేస్తున్న గిజిగాళ్లు
- చక్కటి నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకునేలా గూళ్లు ఏర్పాటు

6లో..



అందాల తార షేక్ రీమా



ఆంధ్రప్రదేశ్ మిస్ టీన్‌గా ఎంపికైన షేక్ రీమా

- మారుమూల మండలం నుంచి మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్
- త్వరలో జాతీయ స్థాయి పోటీలకు..

సుండుపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల సుండుపల్లె మండలంలో అందాల తార పుట్టింది. మట్టిలో మాణిక్యంలా ఆంధ్రప్రదేశ్ మిస్ టీన్‌గా అర్హత సాధించి ఆమె అందాలతో అందరినీ మైమరపించి అదరహో అనిపిస్తోంది. వివరాల్లోకి వెళితే... సుండుపల్లె మండల కేంద్రంలోని షేక్ జాహుద్‌బాషా కుమార్తె షేక్ రీమా బెంగళూరులోని కృపనిధి ఇన్‌స్టిట్యూషన్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల బెంగళూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అందాల పోటీల్లో ఆమె మొదటి స్థానాన్ని సాధించి అందరినీ ఆకట్టుకుంది. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. ఆ పోటీల్లో గెలుపొంది తల్లిదండ్రులకు తాను పుట్టిన సుండుపల్లె మండలానికి మంచిపేరు తీసుకొస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబీకులు మాట్లాడుతూ తమ కుమార్తె రాష్ట్ర స్థాయిలో జరిగిన అందాల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, మరింత పై స్థాయికి వెళ్లేందుకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

రైల్వేకోడూరు ప్రధాన దారిలో వర్షపు నీరు



రైల్వేకోడూరులో భారీ వర్షం

- అప్రమత్తమైన అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గంలో సోమవారం భారీ వర్షం కురవడంతో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ తదితర శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో ఎలాంటి ఇబ్బందులు లేవని, వర్షం ఎక్కువగా కురిసి వరదనీరు ఉధృతంగా వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలో అనేది అధికారులు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కురిసిన వర్షానికి రైల్వేకోడూరు మెయిన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర వీధి రోడ్లు జలమయం అయ్యాయి. దుకాణాల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా రైల్వేకోడూరు మండలంలో వరద ప్రాంతాలైన నరసరాంపేట, ధర్మాపురం, చిన్నలాలాపేట ప్రాంతాల్లో 2005, 2015, 2022 సంవత్సరాల్లో భారీ వర్షాలు కురవడంతో ఆయా ప్రాంతాల్లో ఇళ్లను కోల్పోయారు. కొన్ని ఇళ్లు గుంజన నదిలో కొట్టుకుని పోయాయి. రైల్వేకోడూరు నియోజకవర్గం మొత్తం చుట్టూ నదులు ఉన్నాయి. గుంజన, ముష్టేరు, గుండాలేరు, తిరుపతి ఏరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. కాగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఇరిగేషన్ డీఈ వినోద్‌కుమార్, రైల్వేకోడూరు, రూరల్ సీఐలు హేమసుందర్‌రావు, పి.వెంకటేశ్వర్లు వాగులు, వంకలు, నదులు తదితర ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించి, ప్రజలకు తగిన సూచనలు ఇచ్చారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

- నేడు, రేపు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణశాఖ సూచన
- ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి 24/7 ప్రకారం సిబ్బంది విధుల్లో ఉండాలన్నారు. 15, 16వ తేదీల్లో రాబోయే రెండు రోజులు అత్యధికంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీ వర్షాలు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి కలెక్టరేట్‌లో 08561 293006 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24/7 ప్రకారం సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఉదయం నుంచి కొన్ని చోట్ల భారీ వర్షం కురవగా మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. గాలివీడులో 25.8 మి.మీ., చిన్నమండెంలో 15.8, సంబేపల్లెలో 20, సుండుపల్లెలో 29.8లో, రాయచోటిలో 27.4, లక్కిరెడ్డిపల్లెలో 19.4, రామాపురంలో 24.6, వీరబల్లిలో 28.4, నందలూరులో 56.4, పెనగలూరులో 55.2లో, చిట్వేలిలో 50, రాజంపేటలో 45.4, పుల్లంపేటలో 47.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఓబులవారిపల్లెలో 34, రైల్వేకోడూరులో 90.6, ములకలచెరువులో 19.6, తంబళ్లపల్లెలో 16, పెద్దమండెంలో 19.4, గుర్రంకొండలో 9.8, కలకడలో 13.4, కేవీపల్లిలో 16, పీలేరులో 15.6, కలికిరిలో 14.6, వాల్మీకిపురంలో 12, కురబలకోటలో 22, పెద్దతిప్పసముద్రంలో 3.2, బీ.కొత్తకోటలో 3.2, మదనపల్లెలో 17.8, నిమ్మనపల్లిలో 14.4, రామసముద్రంలో 7.2 మి.మీ. నమోదైనట్లు అధికారులు వివరించారు.



రైల్వేకోడూరులో జలమయమైన రోడ్డు

రాష్ట్రంలో రూ.600 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

- రాయచోటి నియోజకవర్గానికి సీసీ రోడ్లకు రూ.14 కోట్లు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




కుర్నూతలలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే 600 కోట్ల రూపాయలతో గ్రామీణ రోడ్లను మరమ్మతులు చేయిస్తున్నాం.. రాయచోటి నియోజవర్గ వ్యాప్తంగా 14 కోట్ల 5 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పల్లె పండుగా పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని పందిళ్లపల్లె, కుర్నూతల, కస్తూరిరాజుగారిపల్లె, దేవళంపల్లె గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉన్న ఝరికోన, హంద్రీ-నీవా, శ్రీనివాసపురం, వెలిగల్లు, రోళ్లమడుగు ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు, తాగు నీరు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేసిన పాపాన పోలేదని, తెలుగుదేశం ప్రభుత్వంలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి చూపిస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీని గాలికొదిలేశారని, తమ ప్రభుత్వంలో ఆర్టీసీని లాభాల బాటలో పయనింపచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో రెడ్డెయ్య, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, మండల ఇంజనీర్ సుబ్రమణ్యం, సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, హౌసింగ్ ఏఈ జనార్ధన, టీడీపీ మండల నాయకుడు యనమల మదన్ మోహన్ , రాజంపేట పార్లమెంటు మైనార్టీ నాయకుడు డాక్టర్ షఫీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకే ప్రథమ ప్రాధాన్యం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం అందించడానికి జిల్లా పోలీసుశాఖ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను విని, సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. సమస్యను గూర్చి చింతించకుండా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చునని ఎస్పీ ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15, 16వ తేదీల్లో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ సూచనలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని, అతి భారీ వర్షాలు పడే ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వారిని అప్రమత్తం చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌లకు భారీ వర్షాలపై మెసేజ్‌లు పంపి అలర్ట్ చేయాలన్నారు. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రవాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందు అధికారులంతా అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

స్టార్ట్.. యాక్షన్.. కెమెరా..!

● జిల్లాలో సినిమా షూటింగ్‌ల సందడి


● తమిళ అగ్రహీరోల షూటింగ్‌లు ఇక్కడే

● అద్భుతమైన లొకేషన్స్



గండికోటలో కమల్‌హాసన్ భారతీయుడు-2 సినిమా షూటింగ్ సీన్స్


(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడప కళలకు కవులకు పుట్టినిల్లు. అంతేకాదు.. జిల్లాలో ఎంతో చారిత్రాత్మక ముఖ్యప్రదేశాలు ఉన్నాయి. ఒకప్పుడు కడప అంటే ఫ్యాక్షన్ హత్యలు, బాంబులు మోతే వినిపించేది. అలాంటి చోట నేడు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. తెలుగుహీరోల కన్నా తమిళ అగ్రహీరోలే మన కడప గడపలో సినిమా షూటింగ్‌లు చేస్తుండడం గమనార్హం. స్టార్ట్, యాక్షన్, కెమెరా అన్న పదాలు మొన్నటి వరకు హైదరాబాదు, చెన్నై, వైజాగ్, కోనసీమ జిల్లాల్లో వినిపించేవి. ఇప్పుడు మన జిల్లాలో కూడా సినిమా షూటింగ్‌లు జరుగుతుండడం విశేషం. ఇటీవల జరిగిన అగ్ర హీరోల సినిమా షూటింగ్‌లను పరిశీలిస్తే..



గండికోట

గండికోట మన జిల్లాకు పెద్ద చారిత్రక సంపద. ఇప్పుడిది టూరిజం ఫేజ్‌గా మారింది. ఇక్కడ అగ్రహీరోల సినిమాలతో పాటు చిన్నచిన్న సినిమాలు, టీవీ సీరియల్స్ యూట్యూబ్ స్టోరీల షూటింగ్‌లకు కేరాఫ్‌గా ఉండడం గమనార్హం.

గండికోటలో ప్రముఖ తమిళ అగ్రకథానాయకుడు పాన్ ఇండియా హీరో కమల్ హాసన్ నటించి ఇటీవల విడుదలైన భారతీయుడు-2 షూటింగ్ జరిగింది. సినిమాలో కీలకమైన సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. కమల్‌హాసన్ తిరుపతిలో బస చేస్తూ షూటింగ్ కోసం ప్రతిరోజూ హెలిక్యాప్టరులో వచ్చి ఇక్కడ షూటింగ్‌లో పాల్గొనేవారు. ఇక విలక్షణ నటుడు తమిళహీరో విక్రమ్ నటించిన స్వామి-2 కూడా ఇక్కడే షూటింగ్ జరుపుకుంది. సినిమాలో కీలక ఫైట్ సీన్స్ ఇక్కడే చిత్రీకరించారు. అలాగే లారెన్స్ నటించిన సూపర్ కౌబాయ్ షూటింగ్ ఇక్కడే జరుపుకుంది.



తెలుగు సినిమాలు కూడా పదేళ్ల క్రితం రాజమౌళి సునీల్‌ను హీరోగా పెట్టి మర్యాదరామన్న సినిమా తీశారు. ఇందులో కీలకమైన సన్నివేశాలు గండికోట, హనుమనగుత్తి ప్రాంతంలో చిత్రీకరించారు. క్లైమాక్స్ సీన్‌ను ఇక్కడే తీశారు. అలాగే గోపిచంద్ నటించిన సాహసం సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను ఇక్కడే తీశారు. హీరోయిన్ తాప్సీ షూటింగ్‌లో పాల్గొంది. బాలక్రిష్ణ సినిమా వీరసింహారెడ్డి సినిమాలో విలన్ తండ్రి పాత్ర చనిపోతుంది. అంత్యక్రియల సీన్ ఇక్కడే చిత్రీకరించారు. ఇక మంగళవారం సినిమా ఇక్కడే షూటింగ్ చేసుకుంది. మరికొన్ని కన్నడ, తమిళ సినిమాలు ఇక్కడే షూటింగ్ జరుపుకున్నాయి. గండికోట ఇప్పుడు తమిళ, కన్నడ సినిమాలకు హాట్‌స్పాట్‌గా మారిపోయింది.

ఎర్రగుంట్లలో

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించి ఇటీవల విడుదలైన 'వెట్టయం' సినిమా షూటింగ్ కూడా ఇటీవలే ఎర్రగుంట్లలోని నాపరాయి గనుల్లో జరుపుకుంది. రజనీకాంత్‌పై కీలకమైన సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.

తెలుగుగంగ కార్యాలయంలో..



కత్తి సినిమా షూటింగ్ జరుపుకున్న మామిళ్లపల్లె తెలుగుగంగ కార్యాలయం

కడప నగర శివారులోని తెలుగుగంగ కార్యాలయంలో తమిళ హీరో విజయ్ నటించిన కత్తి సినిమా షూటింగ్ చేసుకుంది. ఆ సినిమాలో కలెక్టరేట్‌ను ముట్టడించే సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. ఈ సినిమా కోసం దాదాపు వారం పాటు విజయ్ ఇక్కడే ఉన్నారు. ప్రధాన షెడ్యూలులో హీరో విజయ్‌తో పాటు పలు ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఇక కడపలో కారందోశ మరికొన్ని సినిమాలు షూటింగ్ జరుపుకున్నాయి. ఎన్టీఆర్ సీఎం కాక ముందే బ్రహ్మంగారి జీవిత చరిత్ర బ్రహ్మంగారి మఠం, పుష్పగిరిలో.. ఇక కాశినాయన ఆశ్రమంలో కాశినాయన జీవితచరిత్ర సినిమా మరికొన్ని సినిమాలు షూటింగ్ ఇక్కడే జరిగాయి. మొత్తానికి ఇప్పుడు కడప జిల్లా సినిమా షూటింగ్‌లతో సందడిగా మారిపోయింది. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లకు కడప కేరాఫ్‌గా మారింది.



ఎర్రగుంట్లలో షూటింగ్‌లో పాల్గొన్న రజనీకాంత్

ఆరోగ్య ఖరము...

● కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు..

● 10 మిల్లీలీటర్లు రూ.100

● గాడిద పాలకు భలే గిరాకీ..

గంగిగోవు పాలు.. గరిటెడైనను చాలు.. కడివెడైన నేమి.. ఖరము పాలు.. భక్తి కలిగిన కూడు పట్టెడైన చాలు.. విశ్వదాభిరామ వినురవేమ!

మంచి ఆవు పాలు.. గరిటెడైనా చాలు.. గాడిద పాలు కడివెడున్నా ఉపయోగం లేదు.. అన్నది ఈ పద్యం తాత్పర్యం.



గాడిదతో ఊరూరా తిరుగుతున్న మహిళ..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇప్పుడున్న పరిస్థితి చూసి ఉంటే.. వేమన ఈ పద్యాన్ని పూర్తిగా మార్చి రాసి ఉండేవారేమో.? ఆవు పాలు లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలుకుతుంటే గాడిద పాలు లీటరు రూ.10 వేల వరకు ఉంటోంది. మారిన కాలానికి.. ఆవు పాలు కంటే గాడిద పాలకే గిరాకీ ఎక్కువగా ఉంది. దీనిని బట్టి గాడిద పాలు కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు అనొచ్చేమో.? కొన్ని రోజులుగా రాయచోటి పట్టణంలో కొందరు మహిళలు గాడిదలను వీధుల్లో తిప్పుతూ వాటి పాలను అమ్ముతున్నారు. చంకలో ఓ చిన్న మైకు పెట్టుకుని గాడిద పాలమ్మో.. గాడిద పాలు.. అంటూ ఊరూరా తిరుగుతూ.. పది మిల్లీలీటర్ల పాలు వంద రూపాయలకు అమ్ముతున్నారు.

గాడిద పాలు అమ్ముతూ వెళ్తున్న పీరమ్మ అనే మహిళతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా.. తమది తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల అనీ.. అక్కడ రోళ్లు కొట్టుకుని జీవిస్తామని తెలిపింది. పొలం.. పుట్రా లేకపోవడంతో కూలి పనులే తమకు దిక్కని .. దీంతో తమ పిల్లలు కూడా పెద్ద చదువులు చదవలేదని వివరించింది. మిగతా వివరాలు ఆమె మాటల్లోనే..

సంవత్సరంలో ఆరు నెలల పాటు (వర్షాకాలంలో) తెలంగాణా, ఆంధ్రలో ఊరూరా తిరిగి గాడిద పాలను అమ్ము కుంటాం. మంచిర్యాల పట్టణంలో దాదాపు అందరూ ఈ వృత్తినే ఎంచుకున్నారు. గాడిద పాలు సుమారు పది మిల్లీలీటర్లు రూ.100కు అమ్ముతాం. ప్రస్తుతం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో ఓ చోట గుడారాలు వేసుకుని గాడిదలను అక్కడ ఉంటున్నాం. నా భర్త కూడా నాతో పాటే గాడిదను తీసుకొచ్చాడు. వారం పది రోజుల పాటు ఒక్కో ఊర్లో ఉంటూ గాడిద పాలను అమ్ముకుంటాం. మళ్లీ వేరే ఊరికి వెళ్తాం. ఈ పాలను దగ్గు, జీర్ణసంబంధ వ్యాధులు.. ఉబ్బరం, మలబద్ధకం వ్యాధులు నయమవుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అమ్మపాలతో సమానంగా ఇందులో పోషకాలు ఉంటాయంట. ఎక్కువగా శిశువులకు గాడిదపాలను తాగిస్తారు. ఎటువంటి రోగాలు లేని వాళ్లు కూడా తాగవచ్చు. ప్రస్తుతం చాలామంది గాడిద పాలు కొంటున్నారు. ఒక్కో గాడిద నెల రోజుల వరకు మాత్రమే ఈ పాలను ఇస్తుంది.

గాడిదలకు భలే గిరాకీ

గతంలో గాడిదలు ఎక్కువగా రజకవృత్తి చేసుకునే వాళ్ల దగ్గరే ఉండేవి. అయితే, కొంత కాలంగా గాడిద మాంసానికి విపరీతమైన గిరాకీ ఏర్పడడంతో వాటి సంఖ్య తగ్గిపోతోంది. విజయవాడ వంటి ప్రాంతాలలో గాడిద మాంసం కిలో రూ.800 వరకు ఉంటోంది. ఈ మాంసం తినడం ఆరోగ్యానికి మంచిది అనే నమ్మకంతో గాడిద మాంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా గాడిదల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. దీంతో ఒక్కో గాడిదను రూ.30 వేలు పెట్టి కొనాల్సి వస్తోందని పీరమ్మ తెలిపింది.

అద్భుత ఇంజనీర్లు...

● రాజంపేటలో హల్‌చల్ చేస్తున్న గిజిగాళ్లు

● చక్కటి నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకునేలా గూళ్లు ఏర్పాటు



రాజంపేట పట్టణానికి సమీపంలోని తాళ్లపాక ప్రాంతంలో ఉన్న గిజిగాడి గూళ్లు

రాజంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో గిజిగాడి సంతతి బాగా పెరిగిపోయింది. మానవ ఇంజనీర్లకే అసాధ్యమైన ఇంజనీరింగ్ పనిని కూడా గిజిగాళ్లు సాధించి తరతరాల నుంచి తమ గూళ్ల నైపుణ్యంతో అబ్బురపరచడం గిజిగాడికి ఉన్న ప్రత్యేకత. ఎన్నో ఇంజనీరింగ్ చదువులు చదివి ఎన్నో నిర్మాణాలను చేపడుతున్న మానవ ఇంజనీర్లుతో సమానంగా ఎటువంటి చదువు సంధ్యలేని గిజిగాడి గూళ్ల నైపుణ్యం అద్భుతం, అమోఘం. అతి చిన్న సైజులో ఉండే చిన్న పిచ్చుకలాంటి గిజిగాళ్లు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐదేళ్లుగా బాగా పెరిగిపోయాయి. తాళ్లపాక చుట్టుపక్కల మన్నూరు చెరువు కాలువ వెంబడి, వత్తలూరు రోడ్డులో, రాజంపేట చుట్టుపక్కల ప్రాంతంలోను, పోలిచెరువు కాలువ ప్రాంతంలోను గిజిగాడి గూళ్లు వందల నుంచి వేలకు పెరిగిపోయాయి. అందంగా చూడముచ్చటగా కొంత పసుపురంగును పోలి కళ్లను మైమరిపించే ఈ చిన్నపాటి గిజిగాళ్లు చెరువు కాలువల గట్లలోను, నీటి పరీవాహక ప్రాంతాల్లోను పచ్చికబైళ్ల మధ్య సర్కారు కంపచెట్ల చివర, ఈతచెట్ల చివర, అనేక ముళ్లచెట్లను ఆధారం చేసుకుని వీటి సంతతిని పెంచుకుంటున్నాయి. ఎండకు, వానకు తడవకుండా కేవలం పక్షం రోజుల్లోనే ఎంతో అద్భుతమైన గూళ్లను ఏర్పాటు చేసుకుని ఆ గూళ్లకు తిరిగి బురదమట్టిని అంటించి ఆ బురదమట్టికి మినుగు బురుగులను పెట్టి తన గూటిలో రాత్రివేళ చీకటి లేకుండా మనం కరెంటు బల్బులు వెలిగించినట్టు మినగర పురుగుల లైటింగ్‌లో తమ బిడ్డలను పోషించుకోవడం గిజిగాడికే సాధ్యం. ఈ పక్షుల్లో మగపక్షి ఎంతో కీలకమైంది. గూడు పెట్టేది మగపక్షే. తన ప్రియురాలు ఆడపక్షికి నచ్చే రీతిలో చుట్టుపక్కల మైదాన ప్రాంతంలో ఉండే పచ్చగడ్డి పోసలను సేకరించుకుని పక్షం రోజుల్లో కనీసం వెయ్యికి పైబడి గడ్డిపోసలను సేకరించి ఆ గడ్డిపోసలను ఎండిపోయేలోపే ఎంతో నేర్పరితనంతో ఎండకు ఎండ కుండా, వానకు తడవకుండా కాకులకు, గద్దలకు అందకుండా హెల్మెట్ రూపంలో పైభాగాన్ని నిర్మించి తన సంతతిని పెంచుకోవ డానికి గుడ్లను పెట్టుకుని తమ పిల్లలను పెంచుకోవ డానికి గూడు కింది భాగంలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసుకుని తనకు, తన ఆడ పక్షి ఉండడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకోవడం ఈ గిజిగాడి గూడు మగపక్షి ప్రత్యేకత. ఈ అద్భుతమైన గిజగాడి గూడు అల్లిక మానవ ఇంజనీర్లకు సైతం అంతుబట్టదు.



శభాష్ నాగవేణి

కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతిని చూపుపోయింది. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడకుండా.. ఒకరి వద్ద చేయి చాచకుండా.. తెల్లవారుజామునే లేచి సొంతంగా ఆటో నడుపుతూ మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి.. ఊరూరా అమ్ముతూ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తూ మండలంలో శభాష్ నాగవేణి అనిపించుకుంటోందీ మహిళ.

● అన్నీ తానై కుటుంబాన్ని నడిపిస్తున్న వైనం

● పల్లెపల్లెకూ ఆటోలో కూరగాయలు అమ్ముతూ కుటుంబ పోషణ



భర్తను కూర్చోబెట్టుకుని ఆటో తోలుతున్న నాగవేణి

బి.కోడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతినడంతో రాను రాను కంటి చూపు దెబ్బతిని పూర్తిగా కళ్లు కనిపించని భర్తతో కలిసి జీవిస్తూ కుటుంబానికి పెద్ద దిక్కైంది. తెల్లవారుజామునే తాను ఆటో తోలుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటోంది. అన్నీ తానై తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ శభాష్ నాగవేణి అనిపించుకుంటోంది ఓ మహిళ.

వివరాలిలా..బి.కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కత్తి రమణయ్య 1995లో అంటే దాదాపు 30ఏళ్లకు పైగా కడప వద్ద బయనపల్లె గ్రామానికి చెందిన నాగవేణి అనే ఆమెతో వారి పెద్దలు పెళ్లి చేశారు. అప్పటికే భర్త రమణయ్యకు కంటిచూపు తగ్గుతూ రావడం, అది గమనించిన భార్య నాగవేణి కుటుంబానికి అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తోంది. అంతేకాకుండా కొంతకాలం ఒక ఆటోను బాడుగకు తీసుకుని డ్రైవరును పెట్టుకుని తన భర్తను ఆటోలో ఎక్కించుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముతూ జీవనం సాగిస్తోంది. రెండేళ్ల క్రితం ఆటో బాడుగ కట్టడం, కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో సొంతంగా ఆటోను కంతుల్లో తీసుకుని తనే ఆటోను నడుపుకుంటూ కూరగాయలు అమ్ముతోంది. కంటి చూపు మందగించిన తన భర్తను తెల్లవారుజామున 3గంటలకు ఆటోలో ఎక్కించుకుని బద్వేలు - పోరుమామిళ్ల పట్టణంలో మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేస్తోంది. పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్ముకుంటూ మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి చేరుతుంది. ఇంటికి వచ్చిన తరువాత అన్నం వండి తన భర్త తాను తిని తమకున్న 4పశువులకు మేత కోసం పొలాలకు వెళుతుంది. ఈ వి ధ ం గా



ఆటోలో కూరగాయలు విక్రయిస్తున్న నాగవేణి

తమ పశువులకు వేసుకుని కుటుంబాన్ని పోషిస్తూపలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది నాగవేణి.

బిడ్డలను ఉన్నత చదువులకు..

చూపు మందగించిన భర్తను వెంటబెట్టు క ౦ ని కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూ తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తోంది. తమ కుమారుడు వినయ్‌కుమార్‌ను విజయవాడ వికాస్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదివిపిస్తోంది. పాప వైష్ణవిని గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిస్తోంది. డబ్బుల కోసం చేయి చాచి ఏ ఒక్కరినీ అడగకుండా తన సొంత కష్టార్జితంతో కుటుంబాన్ని పోషించడమే కాకుండా తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుండడంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. అధికారులు స్పందించి ఆమె కుటుంబానికి కొంత చేయూత అందిస్తే కుటుంబ బారాన్ని తగ్గించడమే కాకుండా ఆదుకున్నవారవుతారని వారు కోరుతున్నారు.



డ్రాగన్ సాగు.. ఆదాయం బాగు

● కరువు గడ్డపై సిరులు కురిపిస్తున్న పంట

పెద్దమండ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కరువు గడ్డపై డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభదాయకంగా మారింది. గతంలో ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో అధికంగా ఉన్న ఈ పంటను ఉత్తర భారతదేశంతో పాటు మన ప్రాంతంలో కూడా సాగు చేయడం విశేషం. దీర్ఘకాల దిగుబడులు నికరాదాయంతో పాటు నష్టం లేని పంటగా పేరు పొందింది. ఈ పంట సాగుకు మొగ్గు చూపిన రైతన్నలు లాభాలు గడిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన రైతు షేక్ అజంతుల్లా తనకున్న ఏడు ఎకరాల్లో 1.5 ఎకరం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ రావడంతో ఈ సాగుపై మక్కువ చూపాడు. ఆయన మాటల్లో.. మూడేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను మహారాష్ట్రలోని కోల్హాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నాను. డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ఎకరానికి 2 వేల మొక్కలు నాటడానికి రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేసిన సంవత్సరంలోనే దిగుబడులు వస్తాయి. రెండేళ్లల్లోనే పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలకు కాల పరిమితి 22 సంత్సరాల నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపాడు. వ్యవసాయ సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగు చేయడంతో నీరు ఆదా అవుతుందన్నారు. వీటికి సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ వస్తుందని తెలిపాడు. ప్రతి సంవత్సరం నికరాదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చని, డ్రాగన్ ఫ్రూట్స్ నాణ్యత బట్టి మార్కెట్ కిలో ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. ఈ డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు అజంతుల్లా తెలిపారు.

అంతేకాకుండా ఈ ఫ్రూట్స్ తినడం వల్ల జీర్ణశక్తి పెరిగి, గుండె సమస్యలు తగ్గుతాయని, శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేసి, క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.



కలిచెర్ల సమీపంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట


డ్రాగన్ ఫ్రూట్స్ లాభదాయక పంట



డ్రాన్‌ఫ్రూట్స్ లాభదాయక పంట. వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే శక్తి పంటకు ఉంది.. పోషక విలువలు ఎక్కువగా ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి.

- షేక్ అజంతుల్లా, రైతు, కలిచెర్ల, పెద్దమండ్యం.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల



మైలవరం నుంచి పెన్నానదికి నీటిని వదులుతున్న దృశ్యం

కొండాపురం/మైలవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి సోమవారం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా గండికోట ప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్ కెనాల్‌కు 275 క్యూసెక్కుల చొప్పున విడు దల చేశామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలా శయ డీఈఈ నరసింమామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి సాయంత్రానికి 5వేల క్యూసెక్కుల మేర నీటితో పాటు వర్షపునీరు వచ్చి చేరుతుండటంతో పెన్నాకు 7వేల క్యూసెక్కులు, ఉత్త రకాలువకు 110 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయానికి రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈ తెలిపారు. మైలవరం జలా శయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా. ప్రస్తుతం 5.9 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.

ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 5050 మంది ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ల పోస్టుల కోసం డీఎస్సీలో ఇచ్చే ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప అసి స్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి లక్ష్మినారాయణ ప్రకటనలో తెలిపారు. సెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగతుందని, మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానభూమి వెబ్‌సైట్ సందర్శించాలని కోరారు.

భారీ వర్షాల హెచ్చరికతో డిగ్రీ ఒకేషనల్ పరీక్ష వాయిదా

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో ఈ నెల 15 నుంచి జర గాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియం త్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను ప్రభావం అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాలపై ఉంటుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో యూనివర్శిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి నిర్ణయం మేరకు పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగు పరచాలి



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు వసతులను మెరుగుపరచడంతో పాటు మంచి విద్యను అందించి ప్రయోజకులుగా తయారు చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రకాష్‌నగర్, బాలాజీనగర్, కో-ఆపరేటివ్ కాలనీలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి వంటశాలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు, హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర వాటి గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

రాయుడుకాలనీలో విద్యార్థిని ఆత్మహత్య



రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని రాయడుకాలనీలో సోమవారం విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే..... రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈవిద్యార్థిని తల్లి గత ఏడాది క్రితం బతుకు తెరువు నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో విద్యార్థిని తండ్రి రాజశేఖర్ కూడా కువైట్‌కు వెళ్లడం కోసం సోమవారం మెడికల్‌కు వెళ్లాడు. విద్యార్థిని అక్కచెల్లెళ్లు ముగ్గురు. ఇంట్లో తాతయ్య, నాన్నమ్మతో పాటు విద్యార్థిని ఉంటోంది. ఈక్రమంలో విద్యార్థిని ఆత్మహత్య పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

మద్యం దుకాణం చోరీ కేసులో నిందితుడు అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని కదిరి రింగురోడ్డులో ఉన్న ప్రభుత్వ వైన్‌షాపులో ఆగస్టు 13న జరిగిన దొంగతనం చేసిన కేసులో రెండో నిందితుడు అలెగ్జాండరును అరెస్టు చేసినట్లు సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మద్యం దుకాణం చోరీ కేసులో మొదటి నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని, రెండో నిందితుడు అయిన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన అలెగ్జాండరును పులివెందుల అర్బన్ ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వృత్తి రీత్యా డ్రైవరు అయిన అలెగ్జాండర్ పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సంచరిస్తూ ఉండగా అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కానిస్టేబుల్ రామ్, రమేష్, మహేశ్‌లు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి బాలగంగయ్య (40) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట మండలం మూలవారిపల్లె గ్రామానికి చెందిన గంగయ్య ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో ఇంటి పెద్దలు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఆధార్ తరహా... అపార్



- ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపుకార్డు
- తొలుత 9, 10, ఇంటర్ తరగతులకు జారీ
- ఈ నెలాఖరు వరకు నమోదు ప్రక్రియ



కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్పులు తీసుకువస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో అపార్ పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్రవిద్యాశాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాలో చేపట్టడానికి ఆశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తుంది. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో ఆధార్ తరహాలో కేటాయించనున్న ప్రత్యేక నెంబరు కోసం 9, 10, 11, 12 తరగతుల విద్యార్థుల వివరాలు యుడైస్ ప్లస్‌లో అప్‌డేట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని యాజమాన్యాలు మేనేజ్‌మెంటు ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ప్రస్తుతం పాఠశాలతో పాటు కళాశాల స్థాయిలో ఆధార్‌కార్డులోని వివరాలు నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహిస్తున్న యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేకమైన నెంబరు కేటయింపు విధానం అమలులో ఉంది. అయితే సంబంధిత విద్యార్థి ఇంటర్ పూర్తి కాగానే యుడైస్ డేటా గడువు తీరిపోతుంది. డిగ్రీ, పీజీ విద్యలకు వెళ్లే విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ ప్రగతి గతంలో చదివిన కోర్సుల వివరాలు నమోదు చేసే వ్యవస్థ లేకుండా పోతుంది. కేంద్రం అమలులోకి తీసుకువస్తున్న అపార్‌తో ఆయా సమస్యలకు చెక్ పడనుంది. ప్రతి విద్యార్థికి కేటాయించే విశిష్ట సంఖ్య ద్వారా సంబంధిత విద్యార్థికి సంబంధించిన అకడమిక్ ప్రగతి చదివిన కోర్సుల డేటా ప్రభుత్వం వద్ద ఉంటుంది.

ప్రయోజనాలు

- విద్యార్థులు వివిధ కారణాలతో పలు విద్యాసంస్థలకు మారుతుంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తుంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో విద్యాసంస్థకు మారేటప్పుడు ఇబ్బందులు ఉండవు.
- అపార్ గుర్తింపుతో విద్యార్థులు డీజీ లాకర్‌కు అనుసంధానం అవుతారు. విద్య, విషయక విజయాలు ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.
- పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపవుట్స్‌ను నివారించే అవకాశం ఉంది. విద్యార్థి ఏ కారణంతో అయినా పాఠశాలకు దూరం అయితే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.
- విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, విద్యాసంస్థల్లో చేరికలు మార్పులు వంటి సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపొందించారు.

తల్లిదండ్రుల అంగీకారంతో

విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని అపార్‌కు వివరాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్స్‌కు అధికారులు సూచించారు. యుడైస్‌ప్లస్‌లో ఉన్న డేటాను విద్యార్థి అడ్మిషన్ నెంబరు, ఆధార్, తల్లిదండ్రుల వివరాలతో అప్‌డేట్ చేయడం ద్వారా అపార్‌కు ఆధారం తీసుకుంటారు. తొలివిడతలో 9, 10, 11, 12 తరగతుల వారికి అపార్ నెంబరు కేటాయించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకునేందుకు దరఖాస్తు ఫారాలను ఆయా పాఠశాలలు, కళాశాలలకు పంపారు.

నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట

పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు విద్యార్థులకు సంబంధించిన సమగ్ర డిజిటల్ సమాచార కేంద్రంగా అపార్ పనిచేయనుంది. వివిధ బోర్డులు, వర్శిటీలు జారీ చేసే ప్రతి సర్టిఫికెట్‌పై 12 అంకెలతో కూడిన అపార్ నెంబరు ముద్రిస్తారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లపై అనేక ఫిర్యాదులు రావడం.. వాటి వివరాలను ధ్రువీకరించేందుకు సమ యం తీసుకోనుండడంతో ప్రతి దశలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల జవాబుదారీతనం పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో పాఠశాలలు.. విద్యార్థుల వివరాలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు సంబంధించి 1988 పాఠశాలల్లో లక్షా 40వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే 66 ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి 7558 విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 776 పాఠశాలల్లో లక్షా 68 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

జూనియర్ కళాశాలల్లో...

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సంబంధించి 20 కళాశాలల్లో 4911 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ఐదు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 691 మంది, 72 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 23512 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 97 జూనియర్ కళాశాలల్లో 29114 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అపార్ నమోదు ప్రక్రియ జరగనుంది.

ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలి



విద్యార్థులకు అపార్ నెంబరు కేటాయించేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల వారీగా ప్రిన్సిపల్స్‌కు జారీ చేశాం. తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని యుడైస్ ప్లస్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశాం.

-రవి, ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు తక్షణం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, నేషనల్ హైవేస్ ఎస్డీసీ వెంకటపతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీలతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారులు ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పిసారని.. వారి విజ్ఞప్తులను సంబంధిత అధికారులు తెలుసుకొని పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కారాలు ఉండాలన్నారు పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ రీ ఓపెనింగ్ లేకుండా అర్జీలు పరిష్కరించాలన్నారు. అలాగే ఉదయం 9-30 గంటల నుంచి 10-30 గంటల వరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలో నలుగురు బాధితులు తమ సమస్యలను డీఆర్వోకు ఫోన్ ద్వారా విన్నవించారు. తన భూమి రెండు ఎకరాలు ఉంటే రీ సర్వే తరువాత ఆన్‌లైన్‌లో 1.95 సెంట్లు మాత్రమే చూపిస్తోందని, తన భూమి మొత్తం 2 ఎకరాలు రికార్డుల్లో చూపాలని దువ్వూరు మండలం కామనూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. కడప మండలం చెమ్ముమియాపేట గ్రామ పొలంలో తనకు 1.01 ఎకరాల భూమి ఉండగా, ఇపుడు ఆన్‌లైన్‌లో వేరే వారి పేర్లు చూపుతోందని తనకు న్యాయం చేయాలని పుష్పగిరి రెడ్డన్న ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయకుమార్, నాగేశ్వరావు, డాక్టర్ నాగరాజు, సరస్వతి, వెంకట్రావు, డాక్టర్ బ్రహ్మయ్య, జయసింహ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబజారులో వంటనూనెల అమ్మకం

కడప రూరల్, అక్టోబర్ 14: కడప రైతు బజారులో ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప సౌతరన్ ఆయిల్ డిపో ఆధ్వర్యంలో సరసమైన ధరలకు వంట నూనెలను విక్రయిస్తున్నట్లు సివిల్ సప్లైస్ శాఖ ఏఎస్‌వో తారక్‌నాథ్‌రెడ్డి, కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, ఎంఎల్ ఆర్ఐ సందీప్‌లు తెలిపారు. సోమవారం రైతుబజారులో ఏర్పాటు చేసిన వంటనూనెల దుకాణాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధరలలో 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ రూ.110లకు, అలాగే 910 గ్రాముల సన్‌ఫ్లవర్ అయిల్ ప్యాకెట్ రూ.124లకు అందించడం జరుగుతోందన్నారు. ఒక రేషన్ కార్డుకు 3 పామాయిల్ ప్యాకెట్లు, 1 సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివాహం చేసుకున్న ప్రేమజంటకు కౌన్సెలింగ్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్న ప్రేమజంటకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చాంద్‌బాషా బంధువుల సమీక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన సీతారామప్ప. శంకరమ్మల కుమార్తె సి.మౌనిక(19) మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతుంది. సెప్టెంబరు 29న తండ్రి సీతారామప్పతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు చిత్తూరు బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో మౌనిక అక్కడ నుంచి అదృశ్యమైయింది. అక్టోబరు 3న మౌనిక తల్లి శంకరమ్మ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కూతురు అదృశ్యం అయిందంటూ ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా విచారణ చేసి రామసముద్రం మండలం, చెంబకూరు పంచాయతీ దిన్నెమీద హరిజనవాడకు చెందిన వెంకటప్ప, శ్యామల కుమారుడు శ్రీనివాసులు (23)తో మౌనిక వివాహం చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమజంటను సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజాబీ ఎదుట హాజరుపరిచారు. స్టేషన్‌లో పూలదండలు మార్పించి బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహనికి అర్హులైన ప్రేమ జంటను పెద్దలను ఒప్పించి లేదా చట్టబద్ధంగా పోలీసులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించి పెళ్లి చేసుకోవాలే కానీ పారిపోయి తల్లిదండ్రులను, పోలీసులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

- జిల్లా అంతటా 144.2 మి.మీ వర్షపాతం

కడప రూరల్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడం ఏర్పడింది. దీంతో 17 వరకు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతారణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామునుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. జిల్లా అంతటా 144.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లో 57.0, బద్వేల్ డివిజన్‌లో 74.2, జమ్మలమడుగు డివిజన్‌లో 12.0, పులివెందుల డివిజన్‌లో 1.0 మి.మీ నమోదైంది. సిద్దవటం మండలంలో అత్యధికంగా 29.6 మి.మీ, చాపాడు మండలంలో అత్యల్పంగా 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా.. 17వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉండడంతో జిల్లా వ్యవసాయశాఖ వరి, వేరుశనగ, పత్తి, కంది, పప్పుశనగ రైతులను అప్రమత్తం చేసింది. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి

కడప(కలెక్టరేట్), అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తుపాను కారణంగా జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంతో పాటు కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకునేందుకు, ఫిర్యాదులను ఈ కంట్రోల్ రూములకు తెలపాలని సూచించారు.

వరద బాధితులకు మిట్స్ చేయూత



మంత్రి లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) విజయవాడలో సంభవించిన వరద బాధితుల సహాయార్థం మిట్స్ యాజమాన్యం చేయూత నందించింది. మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళా శాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తన సొంత నిధులతో పాటు కళాశాల సిబ్బంది ద్వారా సేకరించిన రూ.19లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా ఈ విరాళాన్ని విజయవాడలో మంత్రి నారాలోకేష్‌ని కలిసి సీఎం సహాయనిధికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ప్రతి ఒక్కరూ చేయూతనందించి ఆదుకోవాలన్నారు. అనంతరం కరెస్పాండెంట్‌ను మంత్రి లోకేష్ అభినందించారు.

రుణాల కోసం రైతుల ఆందోళన

- ఆంధ్రప్రగతి సొసైటీ బ్యాంకుకు తాళం వేసి నిరసన



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సొసైటీకి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొండాపురం, అక్టోబరు 14: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సొసైటీ ఎదుట రుణాలు ఇవ్వాలంటూ సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. రైతునేస్తం పథకం కింద రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని రైతులు సిబ్బందిని బైటకు పంపించి, బ్యాంకుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా అడుగుతున్నా మేనేజరు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ భూములను ఆయ కం పెట్టుకుని రుణాలు ఇవ్వమని కోరుతున్నా మేనేజరు స్పందించడం లేదని అన్నారు. మేనేజరుకు నచ్చిన వారికే రుణాలు ఇస్తూ తమను తిప్పుకుంటున్నారని నరసింహారెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు న్యాయం జరిగేల రుణాలు ఇప్పించాలని రైతులు బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పీవీ నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు, ఏటూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
రాయచోటి
రాజంపేట / రైల్వేకోడూరు
8 మంగళవారం 15 అక్టోబరు 2024

‘పల్లె పండుగ’తో అభివృద్ధి

గాలివీడు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అరవీడు, గాలివీడు, గోరాన్‌చెరువు, పూలుకుంట పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సిమెంటు రోడ్ల పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడిపోయాయని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధి కోసం నిధులను కేటాయించినట్లు తెలిపారు. గాలివీడు మండలంలో మొదటి విడతలో 2.15 కోట్ల రూపాయలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మరికొన్ని సిమెంటు రోడ్లను మంజూరు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఉపసర్పంచ్ పిచ్చయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి బాబురెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ, టీడీపీ నాయకలు కృష్ణాంజ నేయులు, నాగేశ్వరరావు, రామాంజుల్‌రెడ్డి, టోపీవలి పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని పడమటికోన గ్రామం బలిజపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సంబేపల్లె: సంబేపల్లె మండలంలో అక్టోబరు 15 నుంచి 20వ తేదీ వరకు మంత్రి మండిపల్లి ఆధ్వర్యంలో పల్లెపండుగ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నారాయణరెడ్డిపల్లె గ్రామం సీకే రోడ్డు నుండి కేజీబీవీ జూనియర్ కాలేజీ వరకు 32 లక్షల రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను, దేవపట్ల గ్రామంలోని సీకే రోడ్డు నుండి దేవపట్లమ్మ ఆలయం వరకు 49.5 లక్షల రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

● పలు గ్రామాల్లో రోడ్డు పనులు ప్రారంభించిన మంత్రి మండిపల్లి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్


పూలుకుంటలో సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రైల్వేకోడూరులో సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

రైల్వేకోడూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రూ. 45 లక్షల అంచనా వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. రైల్వేకోడూరు పట్టణంలోని ప్రధాన దారి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు, ప్రధాన రహదారి నుంచి కొత్తకోడూరుకు వెళ్లే రోడ్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే పంచాయతీలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కంకణం కట్టుకున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేసి చూపుతామని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిర్వీర్యం అయిన పంచాయతీరాజ్ వ్యవస్థను బాగుచేసే క్రమంలో పల్లెపండుగలో సిమెంటు రోడ్లు వేయడానికి ఉపాధి హామీ పథకం ద్వారా శ్రీకారం చుట్టారని తెలిపారు. రైల్వేకోడూరు పట్టణంలో మొత్తం 900 మీటర్ల వరకు సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. మండలంలోని సింగిరివారిపల్లెలో 400 మీటర్ల సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఇందుకు 20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, అధికారులు బాల నరసింహులు, ఉమామహేశ్వర్‌రావు, ఉమామహేశ్వర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్, టీడీపీ నాయకులు నార్జాల హేమరాజ్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: చిన్నఓరంపాడు పంచాయతీ సీవో కమ్మపలెలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి 22 లక్షల వ్యయంతో 350 మీటర్లు సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రాజు, తిరుపాల్, తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎస్ఐ మహేష్, ఎంపీడీవో మల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, అనుమలగుండం చంద్రమోహన్, కల్లా చలపతి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్నందున రాజంపేట డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 16వ తేదీ వరకు భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకపోవడం మంచిదన్నారు. పశువుల కాపరులు బయటకు వెళ్లవద్దన్నారు. అత్య వసర పరిస్థితి వస్తే సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని 0865-240079కు తెలియజేయాలని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

తుఫాను వల్ల తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు పడే అకాశం ఉన్నందున వారికోసం ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే 7382669890 నంబరుకు ఏ సమయంలోనైనా విన్నవించి పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఎల్లవేళలా ఈ నంబరు అందుబాటులో ఉంటుందన్నారు.

సంబేపల్లె: రాగల మూడు రోజుల పాటు అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమవారం తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో అక్టోబరు 15, 16, 17 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ప్రమాద హెచ్చరికలు తెలియజేస్తూ ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు. ఏవైనా ప్రమాద సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవ కాశం ఉందని, చెట్ల కింద ఆరుబయట ప్రాంతాల్లో సంచరించకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ఈ మేరకు సంబేపల్లె మండల కేంద్రంలో గ్రామాల్లో డప్పు వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు.

విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి

తగిన జాగ్రత్తలు తీసుకుంటే వర్షాకాలంలో ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునని సంబేపల్లె ట్రాన్స్‌కో ఏఈ రాజేశ్ సోమవారం తెలి పారు. వర్షం కారణంగా విద్యుత్ ప్రమాదం జరగకుండా ఉండాలంటే ఉరుములు, మెరుపులతో వర్షం కురిసేటప్పుడు డిష్ కనెక్షన్‌తోపాటు, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. విద్యుత్ లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయితే సంబంధిత అధికారి, జేఎల్ఎం, ఏఎల్ఎం, లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని విజ్ఞప్తి చేశారు.

రాజంపేటలో రోడ్లు జలమయం


రాజంపేటలో జలమయమైన రోడ్లు

రాజంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండు, ఉస్మాన్‌నగర్, నూనెవారిపల్లె రోడ్డు, ఆర్ఎస్ రోడ్డు, మన్నూరు చుట్టుపక్కల ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో వాతావరణం చల్లబడింది.

అనాథాశ్రమం ప్రారంభం

రాయచోటిటౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి నాయుడుకాలనీలో సోమవారం మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి ఆనాథాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథశ్రమాన్ని ఏర్పాటు చేయడం ప్రతి ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. . ఆశ్రమ వ్యవస్థాపకుడు మదనమోహన్‌రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని, సేవా కార్య క్రమాలు చేపట్టేందుకు మదన్ మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

సంఘ మిత్రను తొలగించాలని జేసీకి వినతి


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన తంబళ్లపల్లి మహిళలు

రాయచోటి(కలెక్టరేట్)అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం కన్నెమడుగు గ్రామ సంఘమిత్రను తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు దాదాపు 50 మంది సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తాము కట్టిన డబ్బులకు రసీదు కూడా ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తోందని వారు అర్జీలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకున్న వారు సాయంత్రం 6 గంటల వరకు వేచి ఉండి జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఈ విషయంపై జేసీ మాట్లాడుతూ విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రేపు ఆంజనేయస్వామి ధ్వజ ప్రతిష్ఠ

రామాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావు పేటలో పురాతన రామాంజనేయస్వామి ఆలయాన్ని ఇటీవలే పునరుద్ధరించారు. ఈ నెల 16న ఈ ఆలయంలో హనుమంతుడి పంచలోహ ఉత్సవమూర్తి, ధ్వజశిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం శ్రీరామదూత అభయాంజనేయస్వామి మూలమూర్తులకు అభిషేకాలు, హోమాలు చేస్తారు.. బుధవారం ఉదయం శాంతి పూజ, శిఖర యంత్ర ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

నందలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శంకర్‌నాయక్ హెచ్చరించారు. సోమవారం అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువకులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదానంలో కేవలం ఆటలు మాత్రమే ఆడాలన్నారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు

పెనగలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సులు లేకుండా వాహనాలు నడపవద్దని పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని పలుచోట్ల తన బృందంతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు అమర్చుకోవాలని దుకాణదారులకు సూచించారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భద్రకాళి, వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను చేసి మాడవీధుల్లో ఊరేగించారు.

చెరువులకు నీరు విడుదల చేయాలి

లక్కిరెడ్డిపల్లె అక్టోబర్14 (ఆంధ్రజ్యోతి); వెలిగల్లు ప్రాజెక్టు నుంచి లక్కిరెడ్డిపల్లె మండలంలోని అన్ని చెరువులకు నీరు విడుదల చేయాలంటూ పీడీఎస్‌యూ నాయకుడు అంకన్న సోమవారం లక్కిరెడ్డిపల్లెలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 2022లో మూత పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పునః ప్రారంభించాలని, జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు అంకన్న తెలిపారు.

10 గంటల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెనగలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెనగలూరు టౌన్ ఫీడర్ ఇండ్లూరు సెక్షన్ పరిధిలోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం రాత్రి కాలిపోయింది. వెంటనే స్పందించిన లైన్‌మెన్ భాస్కర్ సమాచారాన్ని ఏఈ షఫీ, రాజంపేట సబ్‌డివిజన్ ఆపరేషన్ డీఈ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయడంతో సోమవారం ఉదయం వర్షంలో తడుస్తూనే పెనగలూరు విద్యుత్ సిబ్బంది పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. దీంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ వసతి గృహాల్లో జడ్జి తనిఖీలు


బీసీ బాలుర వసతి గృహంలో వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి సూచించారు. పట్టణంలోని రాజంపేట రోడ్డులో ఉన్న ఏపీ గిరిజన, బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో తరగతి గదులతో పాటు డార్మిటరీ, వంట గది, స్టోర్ రూమ్, బాత్‌రూములు తనిఖీ చేసి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల వసతులను విద్యార్థులకు అందజేయాలని వసతి గృహ సంక్షేమ అధికారులకు సూచించారు.

కోదండరామాలయం ఎదుట మద్యం దుకాణాలు వద్దు!

రాజంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే పవిత్రత దెబ్బతింటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోదండరామాలయ సమీప ప్రాంతాల్లో సుమారు ఒక కిలోమీటరు పరిధిలో షాపులు పెట్టవద్దని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు విన్నవించారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు కూడా విన్నవించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది భక్తులు కోదండరామాలయాన్ని సందర్శిస్తుంటారన్నారు. అలాంటి ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే భక్తులకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి రామా లయానికి అతి సమీపంలో మద్యం దుకాణాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వలంటీర్లను కొనసాగించాలి


ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న వలంటీర్లు

సుండుపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని గ్రామ, వార్డు వలంటీర్లు సోమవారం ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి విన్నవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనాన్ని ఇసామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కేవలం రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చి మాతో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పని చేయించిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతున్నా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించి వలంటరీ వ్యవస్థను కొనసాగించడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, వలంటరీ వ్యవస్థను సచివాలయంలో విలీనం చేయాలని వారు వినతి పత్రంలో కోరారు.

శ్రీవాసవి లక్కీడ్రా విజేత రవీంద్ర

నందలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాల సందర్భంగా నాగిరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో భోపాల్‌కు చెందిన రవీంద్ర విజేతగా నిలిచి మొదటి బహుమతి 150 గ్రాముల వెండిని గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి అభినయ మొబైల్ ఫోన్, తృతీయ బహుమతి గెలివి నాగసురేంద్రకుమార్ వెండి దీపాలను గెలుచుకున్నారు. అలాగే 30 మంది కన్సొలేషన్ బహుమతులను కూడా అందజేశారు. రత్నంశెట్టి, భూపాలం రాఘవేంద్ర, గెలివి నాగిశెట్టి, శ్రీరాం హరినాథ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్‌కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలిండియా ట్రెక్కింగ్ పోటీలో చిట్వేలి కేడెట్

చిట్వేలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 4 నుంచి 11 వరకు జరిగిన అరకులోయలో జరిగిన ఆలిండియా ట్రెక్కింగ్ పోటీలో ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్, కేడెట్ రేవూరి దినేష్ పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్ తెలియజేశారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వారిని అభినందించి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థి దినేష్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ డీడీజీ ఎయిర్ కమాండో వీఎంరెడ్డితో కలిసి ట్రెక్కింగ్ చేయడం తమకు ఎంతో ఉత్సాహాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గరాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు

మెరుగైన సేవలే కెనరా బ్యాంకు లక్ష్యం



మాట్లాడుతున్న డివిజనల్ మేనేజర్ సఫిక్

సుండుపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కెనరా బ్యాంకు లక్ష్యమని డివిజనల్ మేనేజర్ సఫిక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు అంటే డబ్బులు వేయడం, తీయడం కాదనీ, బ్యాంకు, ప్రభుత్వం అందించే స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. . ఖాతాదారులకు బ్యాంకుల ద్వారా వచ్చే ప్రయోజనాలను తెలుసుకునేదుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ మస్తాన్, ఫీల్డ్ ఆఫీసర్ సిమ్మి, అసిస్టెంట్ మేనేజర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులు జాగ్రత్తలు పాటించాలి


సూచనలు ఇస్తున్న ఉద్యాన అధికారి సురేష్ బాబు

రాజంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాల కారణంగా తీవ్ర నష్టం కలుగకుండా అరటి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఊటుకూరు, పోలి గ్రామాలో అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరటి రైతులు వరదనీటిని వీలైనంత త్వరగా తోట నుంచి బయటకు పంపి భూమి ఆరనియ్యాలన్నారు. నేల ఆరిన తర్వాత గొర్రుతో అంతర సేద్యం చేసి ప్రతి మొక్కకు 100 గాముల యూరియా లేదా 80 గ్రాముల పొటాష్‌ను 20 నుంచి 25 రోజుల వ్యవధిలో 3 సార్లు వేయాలని సూచించారు. గాలిలో అధిక తేమ కారణంగా సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి జిగురు మందుతో పిచికారీ చేయాలన్నారు. దుంపకుళ్లు ఆశించిన మొక్కలను గుర్తించి 25 గ్రాములు బ్లీచింగ్ పౌడర్‌ను లీటరు నీటికి కలిపి మొదళ్ల తడిచేలా పోయాలన్నారు. తర్వాత మొక్కల మొదళ్లలో 50 గ్రాముల సూడోమొనస్, 250 గ్రాములు వేపపిండి కలిపి వేయాలన్నారు. ముంపునీరు పోయిన వెంటనే ఆకులు, గెలలు బాగా తడిచేలా 13.0.45 లేదా 00.50ను 5 గ్రాములు లీటరు నీటికి కలిపి 3 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకులు, లేత గెలలపై 5 గ్రాములు సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటిలో జిగురు మందుతో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

వేరుశనగ పంట కోతలు ఆపండి

చిన్నమండెం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): .భారీ వర్షాల నేపథ్యంలో వేరుశనగ సాగు చేసిన రైతులందరూ ఈ నెల 18వ తేదీ వరకు పంట కోయరాదని ఏవో గీత ఒకప్రకటనలో సూచించారు.. వరి మడుల్లో మురుగునీరు బయటకు వెళ్లేలాగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవ సాయ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు.

పెనగలూరు: తుఫాను కారణంగా ఈనెల 17 వరకు భారీ వర్షాలు ఉన్నందువల్ల రైతులు పంట కోతలు చేపట్టవద్దని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. పంట కోతలు చేపడితే ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండి చెడిపోయే అవకాశం ఉందన్నారు.

స్టార్ట్.. యాక్షన్.. కెమెరా..!

● జిల్లాలో సినిమా షూటింగ్‌ల సందడి
● తమిళ అగ్రహీరోల షూటింగ్‌లు ఇక్కడే
● అద్భుతమైన లొకేషన్స్


గండికోటలో కమల్‌హాసన్ భారతీయుడు-2 సినిమా షూటింగ్ సీన్స్


(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడప కళలకు కవులకు పుట్టినిల్లు. అంతేకాదు.. జిల్లాలో ఎంతో చారిత్రాత్మక ముఖ్యప్రదేశాలు ఉన్నాయి. ఒకప్పుడు కడప అంటే ఫ్యాక్షన్ హత్యలు, బాంబులు మోతే వినిపించేది. అలాంటి చోట నేడు సినిమా షూటింగ్‌ల సందడి నెలకొంది. తెలుగుహీరోల కన్నా తమిళ అగ్రహీరోలే మన కడప గడపలో సినిమా షూటింగ్‌లు చేస్తుండడం గమనార్హం. స్టార్ట్, యాక్షన్, కెమెరా అన్న పదాలు మొన్నటి వరకు హైదరాబాదు, చెన్నై, వైజాగ్, కోనసీమ జిల్లాల్లో వినిపించేవి. ఇప్పుడు మన జిల్లాలో కూడా సినిమా షూటింగ్‌లు జరుగుతుండడం విశేషం. ఇటీవల జరిగిన అగ్ర హీరోల సినిమా షూటింగ్‌లను పరిశీలిస్తే..



గండికోట

గండికోట మన జిల్లాకు పెద్ద చారిత్రక సంపద. ఇప్పుడిది టూరిజం ఫేజ్‌గా మారింది. ఇక్కడ అగ్రహీరోల సినిమాలతో పాటు చిన్నచిన్న సినిమాలు, టీవీ సీరియల్స్ యుట్యూబ్ స్టోరీల షూటింగ్‌లకు కేరాఫ్‌గా ఉండడం గమనార్హం.

గండికోటలో ప్రముఖ తమిళ అగ్రకథానాయకుడు పాన్ ఇండియా హీరో కమల్ హాసన్ నటించి ఇటీవల విడుదలైన భారతీయుడు-2 షూటింగ్ జరిగింది. సినిమాలో కీలకమైన సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. కమల్‌హాసన్ తిరుపతిలో బస చేస్తూ షూటింగ్ కోసం ప్రతిరోజూ హెలిక్యాప్టరులో వచ్చి ఇక్కడ షూటింగ్‌లో పాల్గొనేవారు. ఇక విలక్షణ నటుడు తమిళహీరో విక్రమ్ నటించిన స్వామి-2 కూడా ఇక్కడే షూటింగ్ జరుపుకుంది. సినిమాలో కీలక ఫైట్ సీన్స్ ఇక్కడే చిత్రీకరించారు. అలాగే లారెన్స్ నటించిన సూపర్ కౌబాయ్ షూటింగ్ ఇక్కడే జరుపుకుంది.



తెలుగు సినిమాలు కూడా పదేళ్ల క్రితం రాజమౌళి సునీల్‌ను హీరోగా పెట్టి మర్యాదరామన్న సినిమా తీశారు. ఇందులో కీలకమైన సన్నివేశాలు గండికోట, హనుమనగుత్తి ప్రాంతంలో చిత్రీకరించారు. క్లైమాక్స్ సీన్‌ను ఇక్కడే తీశారు. అలాగే గోపిచంద్ నటించిన సాహసం సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను ఇక్కడే తీశారు. హీరోయిన్ తాప్సీ షూటింగ్‌లో పాల్గొంది. బాలక్రిష్ణ సినిమా వీరసింహారెడ్డి సినిమాలో విలన్ తండ్రి పాత్ర చనిపోతుంది. అంత్యక్రియల సీన్ ఇక్కడే చిత్రీకరించారు. ఇక మంగళవారం సినిమా ఇక్కడే షూటింగ్ చేసుకుంది. మరికొన్ని కన్నడ, తమిళ సినిమాలు ఇక్కడే షూటింగ్ జరుపుకున్నాయి. గండికోట ఇప్పుడు తమిళ, కన్నడ సినిమాలకు హాట్ స్పాట్‌గా మారిపోయింది.

ఎర్రగుంట్లలో

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించి ఇటీవల విడుదలైన 'వెట్టయం' సినిమా షూటింగ్ కూడా ఇటీవలే ఎర్రగుంట్లలోని నాపరాయి గనుల్లో జరుపుకుంది. రజనీకాంత్‌పై కీలకమైన సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.

తెలుగుగంగ కార్యాలయంలో..


కత్తి సినిమా షూటింగ్ జరుపుకున్న మామిళ్లపల్లె తెలుగుగంగ కార్యాలయం

కడప నగర శివారులోని తెలుగుగంగ కార్యాలయంలో తమిళ హీరో విజయ్ నటించిన కత్తి సినిమా షూటింగ్ చేసుకుంది. ఆ సినిమాలో కలెక్టరేట్‌ను ముట్టడించే సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. ఈ సినిమా కోసం దాదాపు వారం పాటు విజయ్ ఇక్కడే ఉన్నారు. ప్రధాన షెడ్యూలులో హీరో విజయ్‌తో పాటు పలు ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఇక కడపలో కారందోశ మరికొన్ని సినిమాలు షూటింగ్ జరుపుకున్నాయి. ఎన్టీఆర్ సీఎం కాక ముందే బ్రహ్మంగారి జీవిత చరిత్ర బ్రహ్మంగారి మఠం, పుష్పగిరిలో.. ఇక కాశినాయన ఆశ్రమంలో కాశినాయన జీవితచరిత్ర సినిమా మరికొన్ని సినిమాలు షూటింగ్ ఇక్కడే జరిగాయి. మొత్తానికి ఇప్పుడు కడప జిల్లా సినిమా షూటింగ్‌లతో సందడిగా మారిపోయింది. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లకు కడప కేరాఫ్‌గా మారింది.


ఎర్రగుంట్లలో షూటింగ్‌లో పాల్గొన్న రజనీకాంత్

ఆరోగ్య ఖరము...

● కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు..
● 10 మిల్లీలీటర్లు రూ.100
● గాడిద పాలకు భలే గిరాకీ..

గంగిగోవు పాలు.. గరిటెడైనను చాలు.. కడివెడైన నేమి.. ఖరము పాలు.. భక్తి కలిగిన కూడు పట్టెడైన చాలు.. విశ్వదాభిరామ వినుర వేమ!

మంచి ఆవు పాలు.. గరిటెడైనా చాలు.. గాడిద పాలు కడివెడున్నా ఉపయోగం లేదు.. అన్నది ఈ పద్యం తాత్పర్యం.


గాడిదతో ఊరూరా తిరుగుతున్న మహిళ..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇప్పుడున్న పరిస్థితి చూసి ఉంటే.. వేమన ఈ పద్యాన్ని పూర్తిగా మార్చి రాసి ఉండేవారేమో.? ఆవు పాలు లీటరు రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలుకుతుంటే గాడిద పాలు లీటరు రూ.10 వేల వరకు ఉంటోంది. మారిన కాలానికి.. ఆవు పాలు కంటే గాడిద పాలకే గిరాకీ ఎక్కువగా ఉంది. దీనిని బట్టి గాడిద పాలు కడవ అక్కర్లేదు.. చెంచాడు చాలు అనొచ్చేమో.? కొన్ని రోజులుగా రాయచోటి పట్టణంలో కొందరు మహిళలు గాడిదలను వీధుల్లో తిప్పుతూ వాటి పాలను అమ్ముతున్నారు. చంకలో ఓ చిన్న మైకు పెట్టుకుని గాడిద పాలమ్మో.. గాడిద పాలు.. అంటూ ఊరూరా తిరుగుతూ.. పది మిల్లీలీటర్ల పాలు వంద రూపాయలకు అమ్ముతున్నారు.

గాడిద పాలు అమ్ముతూ వెళ్తున్న పీరమ్మ అనే మహిళతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా.. తమది తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల అనీ.. అక్కడ రేళ్లు కొట్టుకుని జీవిస్తామని తెలిపింది. పొలం.. పుట్రా లేకపోవడంతో కూలి పనులే తమకు దిక్కని .. దీంతో తమ పిల్లలు కూడా పెద్ద చదువులు చదవలేదని వివరించింది. మిగతా వివరాలు ఆమె మాటల్లోనే..

సంవత్సరంలో ఆరు నెలల పాటు (వర్షాకాలంలో) తెలంగాణా, ఆంధ్రలో ఊరూరా తిరిగి గాడిద పాలను అమ్ముకుంటాం. మంచిర్యాల పట్టణంలో దాదాపు అందరూ ఈ వృత్తినే ఎంచుకున్నారు. గాడిద పాలు సుమారు పది మిల్లీలీటర్లు రూ.100కు అమ్ముతాం. ప్రస్తుతం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో ఓ చోట గుడారాలు వేసుకుని గాడిదలను అక్కడ ఉంటున్నాం. నా భర్త కూడా నాతో పాటే గాడిదను తీసుకొచ్చాడు. వారం పది రోజుల పాటు ఒక్కో ఊర్లో ఉంటూ గాడిద పాలను అమ్ముకుంటాం. మళ్లీ వేరే ఊరికి వెళ్తాం. ఈ పాలను దగ్గు, జీర్ణసంబంధ వ్యాధులు.. ఉబ్బరం, మలబద్ధకం వ్యాధులు నయమవుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అమ్మపాలతో సమానంగా ఇందులో పోషకాలు ఉంటాయంట. ఎక్కువగా శిశువులకు గాడిదపాలను తాగిస్తారు. ఎటువంటి రోగాలు లేని వాళ్లు కూడా తాగవచ్చు. ప్రస్తుతం చాలామంది గాడిద పాలు కొంటున్నారు. ఒక్కో గాడిద నెల రోజుల వరకు మాత్రమే ఈ పాలను ఇస్తుంది.

గాడిదలకు భలే గిరాకీ

గతంలో గాడిదలు ఎక్కువగా రజకవృత్తి చేసుకునే వాళ్ల దగ్గరే ఉండేవి. అయితే, కొంత కాలంగా గాడిద మాంసానికి విపరీతమైన గిరాకీ ఏర్పడడంతో వాటి సంఖ్య తగ్గిపోతోంది. విజయవాడ వంటి ప్రాంతాలలో గాడిద మాంసం కిలో రూ.800 వరకు ఉంటోంది. ఈ మాంసం తినడం ఆరోగ్యానికి మంచిది అనే నమ్మకంతో గాడిద మాంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా గాడిదల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. దీంతో ఒక్కో గాడిదను రూ.30 వేలు పెట్టి కొనాల్సి వస్తోందని పీరమ్మ తెలిపింది.

అద్భుత ఇంజనీర్లు...

● రాజంపేటలో హల్‌చల్ చేస్తున్న గిజిగాళ్లు
● చక్కటి నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకునేలా గూళ్లు ఏర్పాటు


రాజంపేట పట్టణానికి సమీపంలోని తాళ్లపాక ప్రాంతంలో ఉన్న గిజిగాడి గూళ్లు

రాజంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో గిజిగాడి సంతతి బాగా పెరిగిపోయింది. మానవ ఇంజనీర్లకే అసాధ్యమైన ఇంజనీరింగ్ పనిని కూడా గిజిగాళ్లు సాధించి తరతరాల నుంచి తమ గూళ్ల నైపుణ్యంతో అబ్బురపరచడం గిజిగాడికి ఉన్న ప్రత్యేకత. ఎన్నో ఇంజనీరింగ్ చదువులు చదివి ఎన్నో నిర్మాణాలను చేపడుతున్న మానవ ఇంజనీర్లుతో సమానంగా ఎటువంటి చదువు సంధ్యలేని గిజిగాడి గూళ్ల నైపుణ్యం అద్భుతం, అమోఘం. అతి చిన్న సైజులో ఉండే చిన్న పిచ్చుకలాంటి గిజిగాళ్లు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐదేళ్లుగా బాగా పెరిగిపోయాయి. తాళ్లపాక చుట్టుపక్కల మన్నూరు చెరువు కాలువ వెంబడి, వత్తలూరు రోడ్డులో, రాజంపేట చుట్టుపక్కల ప్రాంతంలోను, పోలిచెరువు కాలువ ప్రాంతంలోను గిజిగాడి గూళ్ల వందల నుంచి వేలకు పెరిగిపోయాయి. అందంగా చూడముచ్చటగా కొంత పసుపురంగును పోలి కళ్లను మైమరిపించే ఈ చిన్నపాటి గిజిగాళ్ల చెరువు కాలువల గట్లలోను, నీటి పరీవాహక ప్రాంతాల్లోను పచ్చికబైళ్ల మధ్య సర్కారు కంపచెట్ల చివర, ఈతచెట్ల చివర, అనేక ముళ్లచెట్లను ఆధారం చేసుకుని వీటి సంతతిని పెంచుకుంటున్నాయి. ఎండకు, వానకు తడవకుండా కేవలం పక్షం రోజుల్లోనే ఎంతో అద్భుతమైన గూళ్లను ఏర్పాటు చేసుకుని ఆ గూళ్లకు తిరిగి బురదమట్టిని అంటించి ఆ బురదమట్టికి మినుగు బురుగులను పెట్టి తన గూటిలో రాత్రివేళ చీకటి లేకుండా మనం కరెంటు బల్బులు వెలిగించినట్లు మినగర పురుగుల లైటింగ్‌లో తమ బిడ్డలను పోషించుకోవడం గిజిగాడికే సాధ్యం. ఈ పక్షుల్లో మగపక్షి ఎంతో కీలకమైంది. గూడు పెట్టేది మగపక్షే. తన ప్రియురాలు ఆడపక్షికి నచ్చే రీతిలో చుట్టుపక్కల మైదాన ప్రాంతంలో ఉండే పచ్చగడ్డి పోసలను సేకరించుకుని పక్షం రోజుల్లో కనీసం వెయ్యికి పైబడి గడ్డిపోసలను సేకరించి ఆ గడ్డిపోసలను ఎండిపోయే లోపే ఎంతో నేర్పరితనంతో ఎండకు ఎండ కుండా, వానకు తడవకుండా కాకులకు, గద్దలకు అందకుండా హెల్మెట్ రూపంలో పైభాగాన్ని నిర్మించి తన సంతతిని పెంచుకోవ డానికి గుడ్లను పెట్టుకుని తమ పిల్లలను పెంచుకోవ డానికి గూడు కింది భాగంలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసుకుని తనకు, తన ఆడ పక్షి ఉండడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకోవడం ఈ గిజిగాడి గూడు మగపక్షి ప్రత్యేకత. ఈ అద్భుతమైన గిజగాడి గూడు అల్లిక మానవ ఇంజనీర్లకు సైతం అంతుబట్టదు.



శభాష్ నాగవేణి

కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతిని చూపుపోయింది. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడకుండా.. ఒకరి వద్ద చేయి చాచకుండా.. తెల్లవారుజామునే లేచి సొంతంగా ఆటో నడుపుతూ మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి.. ఊరూరా అమ్ముతూ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తూ మండలంలో శభాష్ నాగవేణి అనిపించుకుంటోందీ మహిళ.

● అన్నీ తానై కుటుంబాన్ని నడిపిస్తున్నవైనం
● పల్లెపల్లెకూ ఆటోలో కూరగాయలు అమ్ముతూ కుటుంబ పోషణ


భర్తను కూర్చోబెట్టుకుని ఆటో తోలుతున్న నాగవేణి

బి.కోడూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తకు కంటి నరాలు దెబ్బతినడంతో రాను రాను కంటి చూపు దెబ్బతిని పూర్తిగా కళ్లు కనిపించని భర్తతో కలిసి జీవిస్తూ కుటుంబానికి పెద్ద దిక్కైంది. తెల్లవారుజామునే తాను ఆటో తోలుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటోంది. అన్నీ తానై తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ శభాష్ నాగవేణి అనిపించుకుంటోంది ఓ మహిళ.

వివరాలిలా..బి.కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కత్తి రమణయ్య 1995లో అంటే దాదాపు 30ఏళ్లకు పైగా కడప వద్ద బయనపల్లె గ్రామానికి చెందిన నాగవేణి అనే ఆమెతో వారి పెద్దలు పెళ్లి చేశారు. అప్పటికే భర్త రమణయ్యకు కంటిచూపు తగ్గుతూ రావడం, అది గమనించిన భార్య నాగవేణి కుటుంబానికి అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తోంది. అంతేకాకుండా కొంతకాలం ఒక ఆటోను బాడుగకు తీసుకుని డ్రైవరును పెట్టుకుని తన భర్తను ఆటోలో ఎక్కించుకుని మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముతూ జీవనం సాగిస్తోంది. రెండేళ్ల క్రితం ఆటో బాడుగ కట్టడం, కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో సొంతంగా ఆటోను కంతుల్లో తీసుకుని తనే ఆటోను నడుపుకుంటూ కూరగాయలు అమ్ముతోంది. కంటి చూపు మందగించిన తన భర్తను తెల్లవారుజామున 3గంటలకు ఆటోలో ఎక్కించుకుని బద్వేలు - పోరుమామిళ్ల పట్టణంలో మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేస్తోంది. పల్లెల్లో తిరుగుతూ కూరగాయలు అమ్ముకుంటూ మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి చేరుతుంది. ఇంటికి వచ్చిన తరువాత అన్నం వండి తన భర్త తాను తిని తమకున్న 4పశువులకు మేత కోసం పొలాలకు వెళుతుంది. ఈ విధంగా


ఆటోలో కూరగాయలు విక్రయిస్తున్న నాగవేణి

తమ పశువులకు వేసుకుని కుటుంబాన్ని పోషిస్తూపలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది నాగవేణి.

బిడ్డలను ఉన్నత చదువులకు..

చూపు మందగించిన భర్తను వెంటబెట్టుకొని కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూ తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివిస్తోంది. తమ కుమారుడు వినయ్‌కుమార్‌ను విజయవాడ వికాస్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదివిపిస్తోంది. పాప వైష్ణవిని గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిస్తోంది. డబ్బుల కోసం చేయి చాచి ఏ ఒక్కరినీ అడగకుండా తన సొంత కష్టార్జితంతో కుటుంబాన్ని పోషించడమే కాకుండా తన పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుండడంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. అధికారులు స్పందించి ఆమె కుటుంబానికి కొంత చేయూత అందిస్తే కుటుంబ భారాన్ని తగ్గించడమే కాకుండా ఆదుకున్నవారవుతారని వారు కోరుతున్నారు.



డ్రాగన్ సాగు.. ఆదాయం బాగు

● కరువు గడ్డపై సిరులు కురిపిస్తున్న పంట


కలిచెర్ల సమీపంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట

పెద్దమండ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కరువు గడ్డపై డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభదాయకంగా మారింది. గతంలో ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో అధికంగా ఉన్న ఈ పంటను ఉత్తర భారతదేశంతో పాటు మన ప్రాంతంలో కూడా సాగు చేయడం విశేషం. దీర్ఘకాల దిగుబడులు నికరాదాయంతో పాటు నష్టం లేని పంటగా పేరు పొందింది. ఈ పంట సాగుకు మొగ్గు చూపిన రైతన్నలు లాభాలు గడిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన రైతు షేక్ అజంతుల్లా తనకున్న ఏడు ఎకరాల్లో 1.5 ఎకరం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ రావడంతో ఈ సాగుపై మక్కువ చూపాడు. ఆయన మాటల్లో.. మూడేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను మహారాష్ట్రలోని కోల్హాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నాను. డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ఎకరానికి 2 వేల మొక్కలు నాటడానికి రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేసిన సంవత్సరంలోనే దిగుబడులు వస్తాయి. రెండేళ్లల్లోనే పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలకు కాల పరిమితి 22 సంత్సరాల నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపాడు. వ్యవసాయ సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగు చేయడంతో నీరు ఆదా అవుతుందన్నారు. వీటికి సస్యరక్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ వస్తుందని తెలిపాడు. ప్రతి సంవత్సరం నికరాదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చని, డ్రాగన్ ఫ్రూట్స్ నాణ్యత బట్టి మార్కెట్ కిలో ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. ఈ డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు అజంతుల్లా తెలిపారు.

అంతేకాకుండా ఈ ఫ్రూట్స్ తినడం వల్ల జీర్ణశక్తి పెరిగి, గుండె సమస్యలు తగ్గుతాయని, శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేసి, క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్ లాభదాయక పంట



డ్రాన్‌ఫ్రూట్స్ లాభదాయక పంట. వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే శక్తి పంటకు ఉంది.. పోషక విలువలు ఎక్కువగా ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి.

-షేక్ అజంతుల్లా,
రైతు, కలిచెర్ల, పెద్దమండ్యం.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల


మైలవరం నుంచి పెన్నానదికి నీటిని వదులుతున్న దృశ్యం

కొండాపురం/మైలవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి సోమవారం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా గండికోట ప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్ కెనాల్‌కు 275 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి సాయంత్రానికి 5వేల క్యూసెక్కుల మేర నీటితో పాటు వర్షపునీరు వచ్చి చేరుతుండటంతో పెన్నాకు 7వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 110 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మైలవరం జలాశయానికి రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈ తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.9 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.

ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 5050 మంది ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ల పోస్టుల కోసం డీఎస్సీలో ఇచ్చే ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలిపారు. సెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానభూమి వెబ్‌సైట్ సందర్శించాలని కోరారు.

భారీ వర్షాల హెచ్చరికతో డిగ్రీ ఒకేషనల్ పరీక్ష వాయిదా

కడప (ఎడ్యుకేషన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో ఈ నెల 15 నుంచి జరగాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను ప్రభావం అన్నమయ్య, వైఎస్‌ఆర్ కడప జిల్లాలపై ఉంటుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో యూనివర్శిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి నిర్ణయం మేరకు పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగు పరచాలి


అధికారులతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు వసతులను మెరుగుపరచడంతో పాటు మంచి విద్యను అందించి ప్రయోజకులుగా తయారు చేయాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రకాష్‌నగర్, బాలాజీనగర్, కో-ఆపరేటివ్ కాలనీలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి వంటశాలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు, హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర వాటి గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

రాయుడుకాలనీలో విద్యార్థిని ఆత్మహత్య



రాయచోటిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని రాయడుకాలనీలో సోమవారం విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే..... రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈవిద్యార్థిని తల్లి గత ఏడాది క్రితం బతుకు తెరువు నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో విద్యార్థిని తండ్రి రాజశేఖర్ కూడా కువైట్‌కు వెళ్లడం కోసం సోమవారం మెడికల్‌కు వెళ్లాడు. విద్యార్థిని అక్కచెల్లెళ్లు ముగ్గురు. ఇంట్లో తాతయ్య, నాన్నమ్మతో పాటు విద్యార్థిని ఉంటోంది. ఈక్రమంలో విద్యార్థిని ఆత్మహత్య పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

మద్యం దుకాణం చోరీ కేసులో నిందితుడు అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు

పులివెందుల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని కదిరి రింగురోడ్డులో ఉన్న ప్రభుత్వ వైన్‌షాపులో ఆగస్టు 13న జరిగిన దొంగతనం చేసిన కేసులో రెండో నిందితుడు అలెగ్జాండరును అరెస్టు చేసినట్లు సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మద్యం దుకాణం చోరీ కేసులో మొదటి నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని, రెండో నిందితుడు అయిన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన అలెగ్జాండరును పులివెందుల అర్బన్ ఎస్‌ఐ నారాయణ తన సిబ్బందితో ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వృత్తి రీత్యా డ్రైవరు అయిన అలెగ్జాండర్ పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సంచరిస్తూ ఉండగా అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కానిస్టేబుల్ రామ్, రమేష్, మహేశ్‌లు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి బాలగంగయ్య (40) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట మండలం మూలవారిపల్లె గ్రామానికి చెందిన గంగయ్య ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో ఇంటి పెద్దలు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఆధార్ తరహా... అపార్

- ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపుకార్డు
- తొలుత 9, 10, ఇంటర్ తరగతులకు జారీ
- ఈ నెలాఖరు వరకు నమోదు ప్రక్రియ





కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్పులు తీసుకువస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో అపార్ పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్రవిద్యాశాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాలో చేపట్టడానికి ఆశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తుంది. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఆపార్) పేరుతో ఆధార్ తరహాలో కేటాయించనున్న ప్రత్యేక నెంబరు కోసం 9, 10, 11, 12 తరగతుల విద్యార్థుల వివరాలు యుడైస్ ప్లస్‌లో అప్‌డేట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని యాజమాన్యాలు మేనేజ్‌మెంటు ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ప్రస్తుతం పాఠశాలతో పాటు కళాశాల స్థాయిలో ఆధార్‌కార్డులోని వివరాలు నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహిస్తున్న యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేకమైన నెంబరు కేటయింపు విధానం అమలులో ఉంది. అయితే సంబంధిత విద్యార్థి ఇంటర్ పూర్తి కాగానే యుడైస్ డేటా గడువు తీరిపోతుంది. డిగ్రీ, పీజీ విద్యలకు వెళ్లే విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ ప్రగతి గతంలో చదివిన కోర్సుల వివరాలు నమోదు చేసే వ్యవస్థ లేకుండా పోతుంది. కేంద్రం అమలులోకి తీసుకువస్తున్న అపార్‌తో ఆయా సమస్యలకు చెక్ పడనుంది. ప్రతి విద్యార్థికి కేటాయించే విశిష్ట సంఖ్య ద్వారా సంబంధిత విద్యార్థికి సంబంధించిన అకడమిక్ ప్రగతి చదివిన కోర్సుల డేటా ప్రభుత్వం వద్ద ఉంటుంది.

ప్రయోజనాలు

- విద్యార్థులు వివిధ కారణాలతో పలు విద్యాసంస్థలకు మారుతుంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తుంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో విద్యాసంస్థకు మారేటప్పుడు ఇబ్బందులు ఉండవు.
- అపార్ గుర్తింపుతో విద్యార్థులు డీజీ లాకర్‌కు అనుసంధానం అవుతారు. విద్య, విషయక విజయాలు ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.
- పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపవుట్స్‌ను నివారించే అవకాశం ఉంది. విద్యార్థి ఏ కారణంతో అయినా పాఠశాలకు దూరం అయితే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.
- విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, విద్యాసంస్థల్లో చేరికలు మార్పులు వంటి సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపొందించారు.

తల్లిదండ్రుల అంగీకారంతో

విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని అపార్‌కు వివరాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్స్‌కు అధికారులు సూచించారు. యుడైస్‌ప్లస్‌లో ఉన్న డేటాను విద్యార్థి అడ్మిషన్ నెంబరు, ఆధార్, తల్లిదండ్రుల వివరాలతో అప్‌డేట్ చేయడం ద్వారా అపార్‌కు ఆధారం తీసుకుంటారు. తొలివిడతలో 9, 10, 11, 12 తరగతుల వారికి అపార్ నెంబరు కేటాయించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకునేందుకు దరఖాస్తు ఫారాలను ఆయా పాఠశాలలు, కళాశాలలకు పంపారు.

నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట

పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు విద్యార్థులకు సంబంధించిన సమగ్ర డిజిటల్ సమాచార కేంద్రంగా అపార్ పనిచేయనుంది. వివిధ బోర్డులు, వర్శిటీలు జారీ చేసే ప్రతి సర్టిఫికెట్‌పై 12 అంకెలతో కూడిన అపార్ నెంబరు ముద్రిస్తారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లపై అనేక ఫిర్యాదులు రావడం.. వాటి వివరాలను ధ్రువీకరించేందుకు సమ యం తీసుకోనుండడంతో ప్రతి దశలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల జవాబుదారీతనం పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో పాఠశాలలు.. విద్యార్థుల వివరాలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు సంబంధించి 1988 పాఠశాలల్లో లక్షా 40వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే 66 ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి 7558 విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 776 పాఠశాలల్లో లక్షా 68 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

జూనియర్ కళాశాలల్లో...

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సంబంధించి 20 కళాశాలల్లో 4911 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ఐదు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 691 మంది, 72 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 23512 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 97 జూనియర్ కళాశాలల్లో 29114 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అపార్ నమోదు ప్రక్రియ జరగనుంది.

ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలి



విద్యార్థులకు అపార్ నెంబరు కేటాయించేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల వారీగా ప్రిన్సిపల్స్‌కు జారీ చేశాం. తల్లిదండ్రుల అంగీకారం తీసుకుని యుడైస్ ప్లస్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశాం.

-రవి, ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి


అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు తక్షణం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, నేషనల్ హైవేస్ ఎస్డీసీ వెంకటపతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారులు ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పిసారని.. వారి విజ్ఞప్తులను సంబంధిత అధికారులు తెలుసుకొని పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కారాలు ఉండాలన్నారు పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ రీ ఓపెనింగ్ లేకుండా అర్జీలు పరిష్కరించాలన్నారు. అలాగే ఉదయం 9-30 గంటల నుంచి 10-30 గంటల వరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలో నలుగురు బాధితులు తమ సమస్యలను డీఆర్వోకు ఫోన్ ద్వారా విన్నవించారు. తన భూమి రెండు ఎకరాలు ఉంటే రీ సర్వే తరువాత ఆన్‌లైన్‌లో 1.95 సెంట్లు మాత్రమే చూపిస్తోందని, తన భూమి మొత్తం 2 ఎకరాలు రికార్డుల్లో చూపాలని దువ్వూరు మండలం కామనూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. కడప మండలం చెమ్ముమియాపేట గ్రామ పొలంలో తనకు 1.01 ఎకరాల భూమి ఉండగా, ఇపుడు ఆన్‌లైన్‌లో వేరే వారి పేర్లు చూపుతోందని తనకు న్యాయం చేయాలని పుష్పగిరి రెడ్డన్న ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయకుమార్, నాగేశ్వరావు, డాక్టర్ నాగరాజు, సరస్వతి, వెంకట్రావు, డాక్టర్ బ్రహ్మయ్య, జయసింహ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబజారులో వంటనూనెల అమ్మకం

కడప రూరల్, అక్టోబర్ 14: కడప రైతు బజారులో ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప సౌతరన్ ఆయిల్ డిపో ఆధ్వర్యంలో సరసమైన ధరలకు వంట నూనెలను విక్రయిస్తున్నట్లు సివిల్ సప్లైయ్ శాఖ ఏఎస్‌వో తారక్‌నాథ్‌రెడ్డి, కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, ఎంఎల్ ఆర్‌ఐ సందీప్‌లు తెలిపారు. సోమవారం రైతుబజారులో ఏర్పాటు చేసిన వంటనూనెల దుకాణాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధరలలో 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ రూ.110లకు, అలాగే 910 గ్రాముల సన్‌ఫ్లవర్ అయిల్ ప్యాకెట్ రూ.124లకు అందించడం జరుగుతోందన్నారు. ఒక రేషన్ కార్డుకు 3 పామాయిల్ ప్యాకెట్లు, 1 సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివాహం చేసుకున్న ప్రేమజంటకు కౌన్సెలింగ్



మదనపల్లె అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్న ప్రేమజంటకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చాంద్ బాషా బంధువుల సమీక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన సీతారామప్ప. శంకరమ్మల కుమార్తె సి.మౌనిక (19) మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో రెండో సంవత్సరం చదువుతుంది. సెప్టెంబరు 29న తండ్రి సీతా రామప్పతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు చిత్తూరు బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో మౌనిక అక్కడ నుంచి అదృశ్యమైయింది. అక్టోబరు 3న మౌనిక తల్లి శంకరమ్మ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కూతురు అదృశ్యం అయిందంటూ ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ చాంద్ బాషా విచారణ చేసి రామ సముద్రం మండలం, చెంబకూరు పంచాయతీ దిన్నెమీద హరిజనవాడకు చెందిన వెంకటప్ప, శ్యామల కుమారుడు శ్రీనివాసులు (23)తో మౌనిక వివాహం చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమజంటను సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజాబీ ఎదుట హాజరుపరిచారు. స్టేషన్‌లో పూలదండలు మార్పించి బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహనికి అర్హులైన ప్రేమ జంటను పెద్దలను ఒప్పించి లేదా చట్టబద్ధంగా పోలీసులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించి పెళ్లి చేసుకోవాలే కానీ పారి పోయి తల్లిదండ్రులను, పోలీసులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

కడప రూరల్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడం ఏర్పడింది. దీంతో 17 వరకు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతారణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామునుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. జిల్లా అంతటా 144.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లో 57.0, బద్వేల్ డివిజన్‌లో 74.2, జమ్మలమడుగు డివిజన్‌లో 12.0, పులివెందుల డివిజన్‌లో 1.0 మి.మీ నమోదైంది. సిద్దవటం మండలంలో అత్యధికంగా 29.6 మి.మీ, చాపాడు మండలంలో అత్యల్పంగా 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా.. 17వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉండడంతో జిల్లా వ్యవసాయశాఖ వరి, వేరుశనగ, పత్తి, కంది, పప్పుశనగ రైతులను అప్రమత్తం చేసింది. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

వరద బాధితులకు మిట్స్ చేయూత


మంత్రి లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) విజ యవాడలో సంభవించిన వరద బాధితుల సహాయార్థం మిట్స్ యాజమా న్యం చేయూత నందించింది. మండలంలోని అం గళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తన సొంత నిధులతో పాటు కళాశాల సిబ్బంది ద్వారా సేకరించిన రూ.19లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా ఈ విరాళాన్ని విజయ వాడలో మంత్రి నారాలోకేష్‌ని కలిసి సీఎం సహాయనిధికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ప్రతి ఒక్కరూ చేయూతనందించి ఆదుకోవాలన్నారు. అనంతరం కరెస్పాండెంట్‌ను మంత్రి లోకేష్ అభినందించారు.

రుణాల కోసం రైతుల ఆందోళన

కొండాపురం, అక్టోబరు 14: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఆంధ్రప్ర గతి గ్రామీణ బ్యాంకు సొసైటీ ఎదుట రుణాలు ఇవ్వాలంటూ సోమ వారం రైతులు ఆందోళన చేపట్టారు. రైతునేస్తం పథకం కింద రైతులకు బ్యాంకు రుణా లు ఇవ్వడం లేదని రైతులు సిబ్బందిని బైటకు పంపించి, బ్యాంకుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా అడుగుతున్నా మేనేజరు పట్టించుకోవడం లేదని వారు వాపో యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ భూములను ఆయ కం పెట్టుకుని రుణాలు ఇవ్వమని కోరుతున్నా మేనే జరు స్పందించడం లేదని అన్నారు. మేనేజరుకు నచ్చిన వారికే రుణాలు ఇస్తూ తమను తిప్పుకుంటున్నారని నరసింహారెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు న్యాయం జరిగేలా రుణాలు ఇప్పించాలని రైతులు బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

కడప(కలెక్టరేట్), అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను కారణంగా జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంతో పాటు కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో రాముడి పవిత్రో త్సవాలకు అంకురార్పణ గావించారు. ఉదయం ఆలయంలో సుప్ర భాతసేవ మొదలు మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల కలశ స్థాపన, పూజలు నిర్వ హించి పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ గావించా రు. ఈకార్యక్రమాలలో టీటీడీ ఏఈవో గోపీనాథ్, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, ధనుష్, ఆలయ సిబ్బం ది, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలలో నేడు...

వాల్మీకిపురం పట్టాభిరాముడి పవిత్రోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్రాల ప్రతిష్ఠ, భోగోత్సవ మూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



వాల్మీకిపురంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

దారి లేకుండా చేస్తున్నారు..న్యాయం చేయండి

● సబ్‌కలెక్టరేట్‌ను ఆశ్రయించిన బాధితులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణం వాయలవంక వీధి కుటుంబీకులు 46 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్నాం..ఇప్పుడు మా కాలనీకి వెళ్లేందుకు ఉన్న దారిని కొందరు అడ్డగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని సబ్‌కలెక్టరేట్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అనంతరం డీఏవో పద్మావతికి వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్(గ్రీవెన్స్‌డే) వర్షం కారణంగా రద్దు అయినా ఐదుగురు తమ సమస్యలను విన్నవించుకునేందుకు సబ్‌కలెక్టరేట్‌కు వచ్చారు.

సకాలంలో ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేయాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు హరికుమార్‌తో కలసి వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమీక్ష సందర్భంగా ఫ్రీ హోల్డ్ భూములకు సంబధించిన పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గుర్రంకొండలో:గ్రామాల్లో రైతులు ఫ్రీహోల్డ్ భూముల సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ భూముల వివరాల్లో తప్పులుంటే రెవెన్యూ సిబ్బందికి రికార్డులను చూపించి సరి చేసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉండడంతో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సమ్రీన్, ఎంపీడీవో వెంకటేశులు సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ మధురామచంద్రుడు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పల్లెలకు మహర్దశ

●అట్టహాసంగా పల్లెపండుగ కార్యక్రమం ప్రారంభం ● గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం



:కలకడలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు



వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెలో పల్లె పండుగలో అధికారులు, నాయకులు

పీలేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కోట్లాది రూపా యలు వెచ్చించి గ్రామాభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఇంత వరకు అభివృద్ధికి అంతంత మాత్రంగా ఉన్న పల్లెలు ముందుకు దూసుకెళ్లనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం సోమవారం పీలేరు మండలంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా అధికారులు మండలంలోని మేళ్లచెరువు పంచాయతీలో రూ.6 లక్షలు, గూడరేవుపల్లెలో రూ.5 లక్షలు, జాండ్ల పంచాయతీలో రూ.5 లక్షల అంచనాలతో సిమెంటు రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివశంకర్, పీఆర్ డీఈ, ఏఈ, ఉపాధి ఏపీడీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లి కార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జర్రావారిపల్లె, అయ్యావారిపల్లె, నగిరిమడుగు, ముస్టూరువాండ్లపల్లె, గండ బోయనపల్లె తదితర గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి సీసీ రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. జడ్పీటీసీ నిర్మల, ఎంపీడీవో మనోహర్‌రాజు, ఈవోఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, నాయకులు వల్లిగట్ల వెంకటరమణ, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కలకడలో: కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామాలకు మహర్దశ పడుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారంపల్లె పండుగలో భాగంగా బాలయ్యగారిపల్లె, కలకడలో జరిగిన భూమిపూజలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో చెన్నకేశవులు, సర్పంచ్ విశ్వనాథ్, నాయకులు జిలానీ, ఇనాయతుల్లా, ఇర్ఫాన్, ఖాజా, ఇమ్రాన్, ఏఈ రూప్‌సా గర్, కార్యదర్శులు ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని గ్రామాల్లోని 29 పనులకు సంబంధించి 1.65 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మునిరాజ్ కుమార్ మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలంలో మల్లెల, తుమ్మరకుంట గ్రామాల్లో 29 పనులను ఉపాధిహామీ ద్వారా సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

బి.కొత్తకోటలో:రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ సోమవారం బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లె, శీలంవారిపల్లె పంచాయతీలలో ప్రారంభమైంది. మండలంలోని చింతలవారిపల్లె, రఘునాథపురం, చిటికివారిపల్లె, తోకలపల్లె తదితర గ్రామాల్లో రూ.38 లక్షలతో 9 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చు ట్టారు. ఎంపీడీవో శంకరయ్య, పంచాయతీ రాజ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో:తంబళ్లపల్లె నియోజ కవర్గంలోని ఆరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని డ్వామా ఏపీడీ మధుబాబు తెలిపారుజ తంబళ్లపల్లె నియోజ కవర్గంలో మంగళవారం నుంచి పల్లె పం డగ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన ఆదేశించారు. స్థానిక వినాయకనగర్‌లో జరిగే సీసీ రోడ్ల నిర్మాణానికి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారని ములకలచెరువు టీడీపీ కార్యాలయం పేర్కొంది.

కలికిరిలో: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన పల్లెకు పండుగ కార్యక్రమంలో రూ.85 లక్షలతో సీసీ రోడ్లు మం జూరైనట్లు ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. ఉపాధి నిధులతో 19 రోడ్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

నిమ్మనపల్లిలో: నిమ్మనపల్లికు రూ.1.5కోట్లు మంజూరైనట్లు ఎంపీడీవో పర మేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 10 పంచాయతీలలో బీటీ, సీసీ రోడ్లు 40పనులకు గానూ రూ.1.5 కోట్లు వచ్చిందన్నారు.

సెక్రటరీ బదిలీ నియామకంపై ఫిర్యాదు

మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయ తీరాజ్ నిబంధనలకు విరుద్ధంగా ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వంత గ్రామానికి సెక్రటరిగా పోస్టింగ్ ఇచ్చారంటూ బహుజన యువసేన నాయకులు డీపీవో ధనలక్ష్మికి ఫిర్యాదు చేశారు. బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ మండలం అంకిశెట్టిపల్లె గ్రామ పంచాయతీకి ఇటీవల మంజులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. వాస్తవంగా మంజుల స్వంత ఊరు అంకిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోనే వుందన్నారు.

వాల్మీకిపురంలో చోరీ

వాల్మీకిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానిక తిరుచుట్టు వీధికి చెందిన సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గత కొద్ది రోజుల క్రితం విదేశాలకు ఉగాండాకు వెళ్లారు. తిరిగి సో మవారం వచ్చిన వారికి ఇంట్లో బీరువాలు ధ్వంసం, వస్తువులు చిందర వందరగా పడిఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో బీరువా బద్దలు కొట్టి విలువైన విలువైన బంగారు నగలు, లాప్‌టాప్, నగదు అపహరించుకుపోయారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని హార్స్‌లీహిల్స్ ఘాట్‌రోడ్డు మూడవ మలుపులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె ఎగువ కురవంకకు చెందిన పునీత్‌కుమార్ తనకుటుంబంతో కారులో హిల్స్‌ను సందర్శించి తిరుగుప్రయాణమై మూడవమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో కర్నాటకరాష్ట్రం కేజియఫ్‌లోని ఎంఆర్ఎఫ్ టైర్‌షాపు మేనేజర్ ఎం.పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనిని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇతనితో పాటు ద్విచక్రవాహనంలో వున్న తన స్నేహితుడు, కారులో వున్న ఓ బాలికకు స్వల్ప గాయాలయ్యాయి. కానిస్టేబుల్ సురేష్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

మదనపల్లె అర్బన్‌లో: రోడ్డుప్రమాదంలో బి. శివకాశిరెడ్డి(27) అనే యువకుడు గాయపడిన సంఘటన కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు ఆదివారం ఉదయం కడప జిల్లా చిన్నపయ్యగారిపల్లెకు చెందినశివకాశిరెడ్డి కడప నుంచి మదనపల్లెకు వస్తున్న క్రమంలో తాను నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని కురబకోట మండలం, చేనేతనగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ద్విచక్రవాహనం దెబ్బతింది. తీవ్రంగా గాయపడిన యువకున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం, ఆటోని ఢీకొని ఇద్దరికి గాయాలు

రామసముద్రం, అక్టోబరు 14:(ఆంధ్రజ్యోతి) మండలంలోని కేసీపల్లె గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మూగ ఎరపల్లికి చెందిన రమణ అతని కుమార్తె పుంగనూరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా కేసీపల్లి చెందిన జబ్బార్ ఆటోలో పుంగనూరుకు వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రం సచివాలయ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ తమక శంకర కిట్లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్మికులకు యూనిఫాం 2 జతలు, సోపులు, కొబ్బరినూనె, సాక్సులు, షూలు, చెప్పులను అందించారు. దసరా సందర్భంగా ప్రతి సంవత్సరం పంచాయతీ కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్, పాలగిరి రామాంజులు స్కూల్ కమిటీ ఛైర్మెన్ రాము, కార్యం సుబ్రమణ్యం పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వర్షాలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నిమ్మనపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు వుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి ఆర్ఐ రాంమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీధికి దారి మూసేశారంటూ ఫిర్యాదు

బి.కొత్తకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తమ వీధికి వచ్చివెళ్లే దారిని మూసివేశారంటూ బి.కొత్తకోట పట్టణంలోని ఓ వీధిప్రజలు సోమవారం ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీకి ఫర్యాదు చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెనుకవైపున సుమారు 30 కుటుంబాల వారు నివశిస్తున్నారు. వారందరూ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఓ వ్యక్తి దారి మూసివేయించాడని వీధికి దారి సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు.

మదనపల్లెలో ఇద్దరికి రెండేసి మద్యం షాపులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల వేలం పాటల్లో మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇద్దరికి రెండేసి దుకాణాలు దక్కాయి. కేవలం మూడేసి దరఖాస్తులు చేసుకున్న వీరికి రెండేసి దుకాణాలు లక్కీగా లాటరిలో దక్కడంతో ఉబ్బితబ్బిబవుతున్నారు. మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గెజిట్‌నెంబర్ 63 నుంచి 84 నెంబరు వరకు 22 మద్యం దుకాణాలకు సోవవాఆరం రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి నిర్వహించిన లాటరి ఎంపికలో 68,69 దుకాణాలకు పగడాల ఇందిర మూడు దరఖాస్తులు చేసుకోగా లక్కీగా ఆమెకు రెండు దుకాణాల లైసెన్సులు దక్కాయి. అలాగే మదనపల్లె రూరల్ పరిధిలోని 74,76 నెంబరు దుకాణాలకు కుడుం దామోదర దరఖాస్తులు చేసుకోగా ఈరెండు దుకాణాలు కూడా ఆయనకే దక్కాయి. ఇదిలా వుండగా పట్టణంలో పలువురు సిండికేట్లుగా మారి 10 చొప్పున దరఖాస్తులు చేసుకున్నా అలాంటి వారికి ఒక్క దుకాణం కూడా దక్కలేదు.

మద్యం షాపు దక్కించుకున్న సాఫ్ట్‌వేర్

రామసముద్రం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలానికి సంబంధించిన మద్యం షాపు లక్కీడ్రిప్‌లో ఆర్.నడింపల్లికు చెందిన సాఫ్ట్‌వేర్ ఫణిశేఖర్ ఎంపిక అయ్యారు. రాయచోటిలో సోమవారం లక్కీడ్రా నిర్వహించగా మండలంలోని ఒక్క షాపునకు 36మంది దరఖాస్తు చేసుకున్నారు.

పీలేరులో పూర్తయిన లైసెన్స్ హోల్డర్ల ఎంపిక

పీలేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పీలేరు డివిజన్ పరిధిలోని 11 మద్యం దుకాణాలకు లక్కీ డిప్ ద్వారా లైసెన్సుదారుల ఎంపిక పూర్తి చేసినట్లు పీలేరు ఎక్సైజ్ శాఖ సీఐ సీవీ సుబ్బారెడ్డి తెలిపారు. పీలేరులోని ఆరు మద్యం షాపులలో సన్నపు రెడ్డి సుజాతకు రెండు, చిన్న రెడ్డప్ప, అబ్బవరం అమరనాథరెడ్డి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, నారే శశిభూషన్ రెడ్డిలకు ఒక్కొక్క షాపు దక్కినట్లు తెలిపారు. కలకడలో వంగిమళ్ల శ్రీనివాసరెడ్డి, కమ్మినేని వెంకటరమణ, కేవీపల్లెలో పల్లేని మణిచంద్రకు దక్కినట్లు వివరించారు.

మదనపల్లె డీఎల్‌డీవోగా అమరనాథరెడ్డి



మదనపల్లె టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా (డీఎల్‌డీవో)గా అమరనాథరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎల్‌డీవోగా పనిచేసిన లక్ష్మీపతి రాయచోటికి బదిలీ కాగా ఆయన స్థానంలో అనంతపురం నుంచి అమరనాథరెడ్డి బదిలీపై వచ్చారు. సోమవారం స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలోని కార్యాలయంలో డీఎల్‌డీవో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా దుర్గమ్మతల్లి ఊరేగింపు



ఊరేగింపులో దుర్గామాత

మదనపల్లె అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలో దుర్గమ్మ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వైభవంగా దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. యువకులు కేరింతల నడుమ అమ్మవారిని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును నిమజ్జనం కోసం తరలించారు. మహిళలు విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్ర సాదాలు పంపిణీ చేశారు. అనంతరం దుర్గమ్మ లడ్డు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు మార్వారి విక్ర మ్, సిమెంట్ ప్రభు, మార్వారి వినోద్, మున్నా అమ్మినేని, విష్ణు, ప్రవీణ్, భాస్కర్, కౌసిక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పార్టీ కార్యాలయంలో మహిళలతో మాట్లాడుతున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో పారిశుధ్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పేర్కొన్నారు. పీలే రులోని టీడీపీ కార్యాల యంలో సోమవారం ఆమె పట్టణంలోని తెలుగు మహిళా శ్రేణులతో సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్యం, వీధి దీపాలు, మురు గునీటి కాలువలు సరిగ్గా లేవని పలువురు మహిళలు ఆమె దృష్టికి తీసుకె ళ్లారు. ఆ సమస్యలపై ఇప్పటికే ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారని, పంచా యతీ అధికారులతోపాటు మండల స్థాయి అధికారులతో మాట్లాడి పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో పురం రెడ్డమ్మ, సుభద్రమ్మ, సాధనా, స్వర్ణ, రెడ్డిరాణి, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.